ఆదివారం
12-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 141
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ?

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతం గగనతలంపై ప్రస్తుతం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఈ నెల 15వ తేదీ నాటికి అల్పపీడనంగా మారనుందని, దీని ప్రభావంతో కోస్తా, సీమ ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతం ఆగ్నేయం- నైరుతి దిశగా ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది అల్పపీడనంగా మారడానికి అనుకూల వాతావరణం నెలకొని ఉంది. ఈ నెల 15వ తేదీ నాటికి అల్పపీడనంగా మారే అవకాశం ఉంది.

ధరల చిటపట

- పేలుతున్న పప్పులు...
- రెండు నెలల్లో కిలో మినపప్పు రూ.40 పెరుగుదల
- కంది, పెసరపప్పులు... కూరగాయలదీ అదే దారి
- తారాజువ్వలా దూసుకెళుతున్న వంటింటి బడ్జెట్



న్యూఢిల్లీ : దేశంలో ఆహార వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. తారజువ్వల్లాగా దూసుకెళుతున్నాయి. పప్పులు, రవ్వలు, ఇతర నిత్యావసర ధరలు పటాసుల్లా పేలుతున్నాయి. ఇక కూరగాయల ధరలు చూస్తే ఏమాత్రం ప్రజలకు అందుబాటులో లేవు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు ఉంటే, మరోవైపు, పాలకుల అస్తవ్యస్త ఆర్థిక విధానాలు దానికి తోడయ్యాయి. దీంతో ఆహార వస్తువులు ఏవైనా కొనేందుకు, తినేందుకు లేకుండా పోయింది. మొన్నటి దసరా పండుగ నుంచి నేటి దీపావళి పండుగ వరకు మార్కెట్లలో పప్పులు, దినుసులు, చింతపండు, ఉల్లి, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు సీమ టపాకాయల్లా చిటపటలాడుతున్నాయి. వంట గ్యాస్ ధర నామమాత్రపు తగ్గింపు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఏమాత్రం ఊరట కల్పించలేదు.

కుటుంబాన్ని పోషించే యజమానులు ఇతర వస్తువులు, సేవలపై తమ ఖర్చులను సర్దుబాటు చేయడం ద్వారా కూడా ప్రతి నెల ప్రారంభంలో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి కచ్చితమైన మొత్తాన్ని లెక్కించి కేటాయించే రోజులు పోయాయి. ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు ఉన్నప్పటికీ, ఒక చిన్న కుటుంబానికి అవసరమైన ఆహార నూనెలు, పప్పులు, పాలు, పెట్రోలియం మొదలైన వాటిపై ఖర్చు చేసేటప్పుడు ఖర్చులను నియంత్రించడం కష్టం. ఆహార వస్తువుల ధరలు పెరగడంతో సగటు భారతీయ కుటుంబాల కొనుగోలు శక్తి కూడా పడిపోయింది. టమాటాలు, ఉల్లిపాయలు, బఠానీలు, వంకాయలు, వెల్లుల్లి, అల్లంతో సహా వంటకాల్లో ఎక్కువగా ఉపయోగించే కొన్ని కూరగాయల ధరలు గత కొన్ని నెలల్లో రెట్టింపు కంటే ఎక్కువ పెరిగాయి. ఉల్లి ధరలు మరోసారి పెరిగాయి. ఇది గృహ ఖర్చులు మరియు సంభావ్య ద్రవ్యోల్బణం గురించి ఆందోళనలకు దారితీసింది. అక్టోబరు 25 నాటికి ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఉల్లిపాయల గరిష్ట చిల్లర ధర కిలోగ్రాముకు రూ.75కి పెరిగింది. ఖరీఫ్ పంట మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చే డిసెంబరు వరకు ఈ పెరుగుదల కొనసాగుతుందని అంచనా.

అన్నీ రెట్టింపే...

'రెండేళ్ల క్రితం వరకు నా భర్త మాత్రమే పని చేస్తున్నాడు. ఐదుగురు సభ్యుల కుటుంబాన్ని పోషించడానికి పప్పులు, బియ్యం, గోధుమలు, పిండి వంటి ప్రాథమిక వస్తువులను కొనడం మాకు కష్టం. నా పెద్ద కూతురు ఇప్పుడు

- మిగతా 2 లో



పోలవరం సమస్యలు కొలిక్కి వచ్చేనా?

- 20న కేంద్ర జలసంఘం కీలక సమావేశం
- డయాఫ్రం వాల్, కాఫర్ డ్యామ్‌ల సీపేజీ, నిర్వాసితుల సమస్యలే కీలకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పోలవరం ప్రాజెక్టుపై మళ్లీ కేంద్రంలో కదలిక ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేకసార్లు గడువు పెంచుకుంటూ వస్తున్న విషయం తెలిసిందే. కనీసం తొలిదశ నిర్మాణం 2024 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కేంద్ర జల సంఘం సమావేశాలకే పరిమితమవుతూ కాలం సాగదీస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక, తొలి దశ పూర్తికి సవరించిన అంచనా వ్యయం ఖరారే అజెండాగా ఈనెల 20న దిల్లీలో కేంద్రం కీలక సమావేశం నిర్వహిస్తోంది. సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, జలశక్తి శాఖ సలహాదారు శ్రీరాం వెదిరె, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో శివనందన్‌కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం తదితర ముఖ్య అధికారులంతా ఈ సమావేశానికి హాజరు కానుండగా, ఏపీ నుంచి రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య

- మిగతా 2 లో

ముస్లింల సమగ్ర సాధికారతే లక్ష్యం

- మైనార్టీలకు 53 నెలల్లో రూ.23,176 కోట్లు వ్యయం చేశాం
- నామినేటెడ్ పనులు, పదవుల్లో పెద్దపీట
- ఉర్దును రెండో అధికారిక భాషగా గుర్తింపు
- విజయవాడ నుంచే హజ్‌యాత్ర
- ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు ఇచ్చాం
- మైనార్టీల సంక్షేమ దినోత్సవ సభలో సీఎం జగన్

2లో

ప్రముఖ నటుడు చంద్రమోహన్

కన్నుమూత

సినీ ప్రముఖుల సంతాపం | రేపు అంత్యక్రియలు

విశాలాంధ్ర-హైదరాబాద్: టాలీవుడ్‌లో భారీ విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు చంద్రమోహన్ (82) హఠాన్మరణం సినీ ప్రముఖులతో పాటు తెలుగు ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. వైవిధ్యమైన నటనతో సుదీర్ఘ కాలంపాటు తెలుగు ప్రేక్షకులను అలరించిన ఆయన తుదిశ్వాస విడిచారు. రెండు తరాల నటులతో కలిసి నటించిన అయన తెలుగు ప్రజల్లో చెరగని ముద్ర వేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. హృద్రోగంతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 9.45 గంటలకు కన్నుమూశారు.

ఆయనకు భార్య జలంధర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చంద్రమోహన్ అంత్యక్రియలు సోమవారం హైదరాబాద్‌లోనే జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఫిల్మ్‌నగర్‌లోని నివాసానికి చంద్రమోహన్

- మిగతా 2 లో

లండన్‌లో పలస్తీనా

సంఘీభావ భారీ ప్రదర్శన

- పాల్గొన్న 10 లక్షల మంది
- హైడ్ పార్క్ నుంచి అమెరికా దౌత్యకార్యాలయం వరకు మార్చ్
- మార్మోగిన కాల్పుల విరమణ, పలస్తీనా విమోచన నినాదాలు

లండన్: గాజాలో తక్షణమే కాల్పుల విమరణ అమలునకు డిమాండ్ చేస్తూ దాదాపు 10 లక్షల మంది లండన్ వాసులు కదం తొక్కారు. పలస్తీనా సంఘీభావ ప్రదర్శన సెంట్రల్ లండన్‌లోని హైడ్ పార్క్ నుంచి శనివారం మధ్యాహ్నం మొదలైంది. థేమ్స్ నదికి దక్షిణాన ఉన్న వౌక్స్‌హాల్‌లోని అమెరికా ఎంబసీ వరకు సాగింది. సాయంత్రం 4 గంటలకు ప్రదర్శన ముగిసింది. 'పలస్తీనా విమోచనం', 'కాల్పుల విరమణ', 'నది నుంచి సముద్రం వరకు' వంటి నినాదాలు మార్మోగాయి. పలస్తీనాకు అనుకూలంగా ప్లకార్డులు, బ్యానర్లు, పలస్తీనా జెండాలు ప్రదర్శించారు. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ మొదలైనప్పటి నుంచి బ్రిటన్ రాజధానిలో అనేక ప్రదర్శనలు నిర్వహించగా, శనివారం 'నేషనల్ మార్చ్ ఫర్ పలస్తీనా' పేరుతో భారీ సంఘీభావ ప్రదర్శన జరిగింది. ఆర్మిస్టైస్ డే (అమరుల దినం)న దీనిని చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వ వర్గాలు వద్దని వారించినా భారీఎత్తున ప్రజలు ఈ ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. కాగా 10 లక్షల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు, పలస్తీనా సంఘీభావ ఉద్యమం (పీఎస్‌సీ)కు చెందిన బెన్ జమాల్ 'రాయిటర్స్'కు తెలిపారు. ప్రదర్శన

- మిగతా 2 లో

ఇదీ లోకం!



రాజధాని పేరుతో భూ దోపిడీ

ఉత్తరాంధ్రపై కపట ప్రేమ

వైసీపీ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఉత్తరాంధ్రపై వైసీపీ ప్రభుత్వం నాటకాలాడుతోంది. నాలుగున్నరేళ్లుగా గుర్తుకురాని ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై తాజాగా ప్రేమ ఒలకబోస్తోంది. దీనిపై ఉత్తరాంధ్ర వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు. మరోవైపు, ఈ ప్రాంతంలో గల విలువైన సహజ వనరులు దోచుకోవడానికే ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి పేరుతో రాజధాని నాటకం ఆడుతోందని మేధావులు అంటున్నారు. ఉత్తరాంధ్రపై వైసీపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోంది. ముఖ్యమంత్రి జగన్ మొదలుకొని...మంత్రులు, ప్రజాప్రతినిధుల వరకు ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి గురించి పదేపదే మాట్లాడుతున్నారు. ఈ ప్రేమ మాటలకే పరిమితమవుతోంది. ఆచరణలో మాత్రం అభివృద్ధి పేరుతో ఇక్కడి భూములను ప్రభుత్వం పందేరం చేస్తోంది. రూ.2 వేల కోట్లు విలువచేసే 17 ఎకరాల భూమిని ఇనార్బిట్ మాల్ నిర్మాణం కోసం రహేజా గ్రూపునకు కేవలం రూ.125 కోట్లకే 30 ఏళ్లకు జగన్ ప్రభుత్వం లీజుకు

- మిగతా 2 లో

నవాజ్ షరీఫ్‌కు ఉపశమనం

స్వాధీనం చేసుకున్న ఆస్తులు తిరిగివ్వాలని ఇస్లామాబాద్ కోర్టు ఆదేశాలు



ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు ఉపశమనం లభించింది. అవినీతి కేసుకు సంబంధించి 2020లో స్వాధీనం చేసుకున్న స్థిరాస్తులు, చరాస్తులను ఆయనకు తిరిగివ్వాలని అధికారులకు ఇస్లామాబాద్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పీఎంఎల్-ఎన్) అధ్యక్షుడు షరీఫ్ (73) అక్టోబరు 21న పాకిస్తాన్‌కు తిరిగి వచ్చారు. అంతకుముందు నాలుగేళ్లు లండన్‌లో ఉన్నారు. షరీఫ్ లొంగిపోయారని, ఆయన అరెస్టు వారెంటు రద్దు అయిందని జడ్జి బషీర్‌కు నవాజ్ షరీఫ్ తరపు న్యాయవాది మిస్బాహుల్ హసన్ కాజీ తెలిపారు. ఆస్తుల అటాచ్‌మెంట్ ఉత్తర్వులు ఉపసంహరించాలని కోరారు. షరీఫ్ హైకోర్టు అనుమతితో వైద్యం కోసం విదేశాలకు వెళ్లాలన్నారు. ఆయనపై నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ) కేసు నమోదైంది. ఆయన ఆస్తుల అటాచ్‌మెంట్ ప్రక్రియలు జరిగాయి. తోషాఖానా నుంచి ఓ వాహనాన్ని కేవలం 15శాతం ధర చెల్లించి షరీఫ్ సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2008లో పదవిలో లేకపోయినాగానీ ఆయనకు వాహనాన్ని ఇచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. 200 ఎకరాలకుపైగా వ్యవసాయ భూమి, మర్సిడెజ్ బెంజ్ కారు, లాండ్ క్రూజర్, మరికొన్ని వాహనాలను షరీఫ్ తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తోషాఖానా కేసులో ఆయనను 2020లో దోషిగా ఖరారు చేశారు. ఎన్ఏబీ నివేదిక ఆధారంగా షరీఫ్‌కు చెందిన చరాస్తులు, స్థిరాస్తులను స్వాధీనం చేసుకోవాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. కాగా, పాకిస్తాన్‌కు షరీఫ్ తిరిగి రావడానికి ముందు ఆయన న్యాయబృందం ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. ఎవెన్‌ఫీల్డ్, అల్ అజీజియా కేసుల్లో ఆయనకు ముందస్తు బెయిల్‌ను అక్టోబరు 24 వరకు ఇవ్వాలని కోరింది. తోషాఖానా కేసులో ఆయనపై అరెస్టు వారెంట్‌ను అవినీతి నిరోధక కోర్టు కొట్టివేసింది. షరీఫ్ లొంగిపోయినందున ఆయన అరెస్టు వారెంటు రద్దు అయినట్లు ఎన్ఏబీ ప్రాసిక్యూటర్ వెల్లడించారు. ఇక విచారణను కొనసాగించవచ్చన్నారు. దీంతో రూ.10లక్షల పూచీకత్తుతో షరీఫ్‌కు బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. తదుపరి విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో పీఎంఎల్-ఎన్ తరపున షరీఫ్ పోటీ చేయనున్న క్రమంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది.

ఐస్‌ల్యాండ్‌లో అత్యవసర పరిస్థితి

వణికించిన 800 భూకంపాలు

అగ్ని పర్వతం బద్దలయ్యే సంకేతాలు

రేక్‌జేన్స్: ఐస్‌ల్యాండ్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. రేక్‌జేన్స్ ద్వీపకల్పంలో శక్తిమంతమైన భూకంపాలు సంభవించాయి. వరుసగా 800 భూకంపాలు సంభవించడంలో అగ్నిపర్వతం బద్దలు కావచ్చని నిపుణులు అంచనా వేశారు. తాజా పరిణామాలతో ఐస్‌ల్యాండ్‌లో ఎమర్జెన్సీని పౌర రక్షణ, అత్యవసర నిర్వహణ శాఖ ప్రకటించింది. భూకంపాల తీవ్రత మరింత పెరగవచ్చని... అగ్ని పర్వతం బద్దలయ్యేందుకు దారితీయొచ్చని అధికారులు హెచ్చరించారు. అగ్ని పర్వతం బద్దలయ్యేందుకు కొన్ని రోజుల సమయం పడుతుందని ఐస్‌లాండ్ వాతావరణ కేంద్రం (ఐఎంఓ) వెల్లడించింది. వరుస భూకంపాలు సంభవించిన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న 4వేల మందితో కూడిన గ్రిండ్‌విక్ గ్రామాన్ని అధికారులు ఖాళీ చేయించారు. రేక్‌జావిక్‌కు 40కిమీల దూరంలో రెండు శక్తిమంతమైన భూకంపాలు సంభవించాయి. భూకంప ప్రభావానికి అక్కడి ఇళ్లు ఊగిపోగా కిటికీల అద్దాలు పగిలిపోయాయి. వస్తువులన్నీ చల్లాచదురయ్యాయి. గ్రిండ్‌విక్‌కు ఉత్తరం దిశగా 5.2 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు ఐఎంఓ ప్రాథమికంగా తెలిపింది. అర్ధరాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు సుమారు 800 భూకంపాలు సంభవించాయి. అక్టోబరు చివరి నుంచి ద్వీపకల్పంలో కనీసం 24వేల సార్లు భూమి కంపించింది. భూకంపం బద్దలై లావా బయటకు వచ్చేందుకు చాలా రోజులు పట్టవచ్చని ఐఎంఓ తెలిపింది. లావా ప్రవాహం ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా ఉంటుందన్న అంచనా వేసింది. ఇప్పటికే అత్యవసర శిబిరాలు, సహాయ కేంద్రాలను గ్రిండ్‌విక్‌తో పాటు దక్షిణ ఐస్‌ల్యాండ్‌లోని మరో మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ప్రజలకు సహకారాన్ని అధికారులు అందిస్తున్నారు.

కెనడాలో గ్యాంగ్‌వార్

భారత సంతతి తండ్రి కొడుకుల కాల్చివేత

ఒట్టావా: కెనడాలో గ్యాంగ్‌వార్ జరిగింది. భారత సంతతి హర్‌ప్రీత్ సింగ్ ఉప్పల్, ఆయన 11 ఏళ్ల కుమారుడు హత్యకు గురయ్యారు. ఉప్పల్‌కు మాదకద్రవ్యాల ముఠాలతో సంబంధాలు ఉన్నాయని కెనడా పోలీసులు తెలిపారు. అతని గురించి తమకు 2012 నుంచి తెలుసన్నారు. కెనడా ఎడ్‌మాంటన్‌లో ఈ ఘటన జరిగింది. బ్రిటిష్ కొలంబియా లోవర్ మెయిన్‌ల్యాండ్, అల్‌బర్టేటా ముఠాలకు మధ్య ఘర్షణ వల్ల ఈ హత్యలు జరిగాయని వార్తా నివేదికలు తెలిపాయి. ఉప్పల్‌పై ఇంతకుముందు కూడా హత్యాయత్నం జరిగింది. అతను, అతని కుటుంబం త్రుటిలో తప్పించుకున్నారు. ఉప్పల్ డ్రగ్ గ్యాంగ్ వరల్డ్ సభ్యుడని పోలీసులు తెలిపారు. ఉప్పల్ కుమారుడి మిత్రుడు ఈ దాడిలో సురక్షితంగా బయట పడ్డాడు. ఎడ్‌మాంటన్ పోలీసు సూపరింటెండెంట్ కోలిన్ డెరెక్సన్ మాట్లాడుతూ ఉప్పల్ కుమారుడు కూడా కారులో ఉన్నట్లు తెలుసుకున్న హంతకుడు లేక హంతకులు అతనిని ఉద్దేశపూర్వకంగా కాల్చి చంపారన్నారు. బాలుడి దారుణహత్య ఆక్షేపణీయమని, హింస పెరుగుతుండటం ఆందోళనకరమని అల్‌బర్టా ప్రధాని స్మిత్ పేర్కొన్నారు. పిల్లలు చనిపోవడం లేక గాయపడటం బాధాకరమని పోలీసులు అన్నారు. కేసు విచారణకు దోహదమయ్యే సమాచారం ఉంటే తమకు వెంటనే తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చంద్రమోహన్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

భౌతికకాయాన్ని తరలించారు. అమెరికాలో ఉన్న చిన్న కుమార్తె మధుర మీనాక్షి వచ్చాక సోమవారం మధ్యాహ్నం తర్వాత చంద్రమోహన్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన మేనల్లుడు కృష్ణప్రసాద్ తెలిపారు. " నాలుగేళ్ల నుంచి చంద్రమోహన్ హృద్రోగ సమస్యతో బాధపడుతున్నారు. చికిత్స తీసుకుంటుండగా కిడ్నీలపై కూడా ప్రభావం పడింది. ఈరోజు ఉదయం 8 గంటలకు అపోలో ఆస్పత్రికి తరలించాం. 9.45 గంటలకు చంద్రమోహన్ మృతి చెందారు" అని కృష్ణప్రసాద్ తెలిపారు.

కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 1943 మే 23న జన్మించిన చంద్రమోహన్ అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్ రావు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. 1966లో రంగుల రాట్నం సినిమాతో సినీరంగ ప్రవేశం చేశారు. అనేక తమిళ సినిమాల్లోనూ నటించారు. హీరోగానే కాకుండా కమెడియన్, సహాయనటుడిగానూ ఆయన విభిన్న పాత్రలు పోషించారు. 'ఆత్మీయులు', 'తల్లిదండ్రులు', 'సంబరాల రాంబాబు', 'జీవన తరంగాలు', 'గంగామంగా', 'అల్లూరి సీతారామరాజు', 'సిరి సిరి మువ్వ', 'సీతా కల్యాణం', 'శుభోదయం', 'పక్కింటి అమ్మాయి', 'రాధా కల్యాణం', 'ఇంటి గుట్టు', 'సువర్ణ సుందరి', 'ఆఖరి పోరాటం' 'ఆదిత్య 369', 'పెద్దరికం', 'గులాబి', 'చంద్రలేఖ', 'ఇద్దరు మిత్రులు', '7జీ బృందావన్ కాలనీ', 'ఢీ', 'కింగ్', 'లౌఖ్యం' వంటి చిత్రాల్లో ఆయన నటించారు. తన నటనకు ఫిలింఫేర్, నంది అవార్డులు అందుకున్నారు. 'పదహారేళ్ల వయసు', 'సిరి సిరి మువ్వ' సినిమాల్లో ఆయన నటనకు ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డులు దక్కాయి. 1987లో 'చందమామ రావే' సినిమాకు ఉత్తమ హాస్యనటుడిగా నంది అవార్డు, 2005లో 'అతనొక్కడే' సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. చివరగా 2017లో 'ఆక్సిజన్' సినిమాలో కన్పించారు. కీ.శే కె. విశ్వనాథ్‌కు చంద్రమోహన్ సమీప బంధువు.

'హీరోలందరూ నటులు కాలేరు. కానీ, నటులు హీరోలు కావచ్చు' ఎందుకంటే కథకు హీరో అయితే ఆ కథే అతడికి పేరు తీసుకొస్తుంది. కానీ, అదే కథకు నటుడు దొరికితే అది అద్భుత చిత్రమవుతుందని చిత్ర పరిశ్రమలో ఒక వాదన ఉంది. ఈ రెండింటికీ సరిపోయే అతి కొద్ది మంది నటుల్లో చంద్రమోహన్ ఒకరు. ఆయన ఒక హీరో.. ఒక కమెడియన్.. ఒక క్యారెక్టర్ ఆర్టిస్ట్.. పిల్లలకు తండ్రి... ఇలా చెప్పుకుంటూ పోతే చంద్రమోహన్ ఒక సహజ నటుడు. నీరు ఏ పాత్రలో పోస్తే, దాని ఆకారాన్ని సంతరించుకున్నట్లు చంద్రమోహన్ కూడా ఆ పాత్రలో ఇమిడిపోతారు.. కలిసిపోతారు.. అందులో మమేకమై మన హృదయాలకు దగ్గరవుతారు. చిత్ర పరిశ్రమలో నటుడిగా ప్రయాణం మొదలు పెట్టిన తర్వాత చాలా మంది ఏదో ఒక విషయంలో ప్రతిభను కనబరుస్తారు. అంటే యాక్షన్ హీరో, ఫ్యామిలీ స్టార్, కమెడియన్ ఇలా ఏదో ఒక దానిలో ఇమిడిపోతారు. 'చంద్రమోహన్ ఇలాంటి పాత్రలే చేస్తాడు' అని కాకుండా 'ఎలాంటి పాత్ర అయినా చేస్తాడు' అని అనిపించుకున్నారు. ఒకరి నటనను, వారి వాయిస్‌ను అనుకరించడం మనం చూస్తూనే ఉంటాం. చాలా తక్కువ మంది నటులను మాత్రమే ఎవరూ అనుకరించలేరు. ఒక నటుడిని అనుకరించాలంటే ఆయనలోని నటనాపరమైన ఒక మేనరిజం పట్టుకోవాలి. అలాంటి మేనరిజాలేమీ లేకుండా పాత్రకు తగ్గట్టు మారిపోతుంటే ఆర్టిస్టును ఇమిటేట్ చేయడం కష్టం. అలా మిమిక్రీ ఆర్టిస్ట్‌కు కూడా దొరకని నటుడే చంద్రమోహన్. అందుకే ఆయన సహజ నటుడు అయ్యారు.

సంఘీభావ భారీ ప్రదర్శన

(మొదటిపేజీ తరువాయి)

శాంతియుతంగా సాగినట్లు తెలిపారు. రెండు వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ ప్రదర్శన క్రమంలో పరిస్థితిని అదుపు తప్పకుండా చూడటం సవాళ్లభరితమని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ లారెన్స్ టైలర్ అన్నారు. మొదటి ప్రపంచం యుద్ధం ముగిసిన రోజు, అమరుల దినం సందర్భంగా పలస్తీనా సంఘీభావ ప్రదర్శన చేపట్టడం అన్నది 'ఆర్మిస్టైస్ డే'కు అగౌరవమని ప్రధాని రిషి సునాక్ అన్నారు. బ్రిటీష్ లేబర్ పార్టీ మాజీ అధినేత జేరిమీ కార్బిన్ సహా ప్రముఖ నటులు, క్రీడాకారులు, కళాకారులు, మేధావులు, ఆర్థికవేత్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే కొన్ని చోట్ల కౌంటర్ ప్రదర్శనలు జరిగిన క్రమంలో పోలీసులు సుమారు 82 మందిని అదుపులోకి తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కాకుండా చూశారు.

దేశంలో కాంగ్రెస్ గాలి వీస్తోంది

కేంద్రంలో మేమొస్తేనే ఏపీ అభివృద్ధి
తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఖాయం
కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

డీకే శివకుమార్, రఘువీరా రెడ్డి, రుద్రరాజుతో కలిసి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డి, విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బుర్రా కిరణ్, కృష్ణాజిల్లా అధ్యక్షుడు సంజీవ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపడుతుందని కాంగ్రెస్ నాయకుడు, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డితో కలిసి శనివారం విజయవాడ ఏపీ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌కు విచ్చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆయనకు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, కొండపల్లి బొమ్మను జ్ఞాపికగా అందజేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, కేంద్ర మాజీ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటాలకు ముందుగా పూల మాలలేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో శివకుమార్ మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు అన్ని విభజన హామీలు అమలవుతాయని తేల్చిచెప్పారు. కష్టించి పని చేయాలని, నమ్మకం కోల్పోకుండా సమస్యలపై పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోనియా, ఖర్గే, రాహుల్ గాంధీ నాయకత్వంలోనే సమ న్యాయం జరిగే ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని. ఆంధ్ర ప్రదేశ్‌లోనూ పార్టీ అధికారంలోకి వచ్చే సమయం దగ్గర పడిందని చెప్పారు. ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో గిడుగు రుద్రరాజు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఎంతో కృషి జరుగుతుందని శివకుమార్ ప్రశంసించారు. ఇటువంటి నాయకత్వంలో పార్టీ పునర్ వైభవం సాధిస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. ప్రాంతీయ పార్టీలు వైసీపీ, టీడీపీ వల్ల ఉపయోగం లేదని ఆయన తేల్చి చెప్పారు. కేంద్రం సహాయం మీదే రాష్ట్ర అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రాంతీయ పార్టీలు అన్నీ కుటుంబ పార్టీలేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన చారిత్రక అవసరం ఉందని ఆయన తెలిపారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడుతూ డీకే శివకుమార్ కాంగ్రెస్ పార్టీకే పెద్ద ఆస్తి అని, పార్టీ పరంగా దేశంలో ఎక్కడ సమస్యలు ఉత్పన్నమైనా ట్రబుల్ షూటర్‌లా వెళ్లి సమస్యలు పరిష్కరిస్తారని వెల్లడించారు. అంతకుముందు,

ముస్లింల సమగ్ర సాధికారతే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ముస్లిం సోదరులకు రాజకీయ, ఆర్థిక, మహిళా, విద్యా సాధికారతతో పాటు వారి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మైనార్టీల సంక్షేమం కోసం గత 53 నెలల్లో రూ.23,176 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. వీటిలో నా అన్నదమ్ములు, నా అక్కచెల్లెమ్మలకు నేరుగా బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి రూ.12,375 కోట్లు పంపించగలిగామన్నారు. ఇక నాన్ డీబీటీ పథకాల కింద ఇళ్ల స్థలాలు, విద్యాకానుక, సంపూర్ణ పోషణం వంటివి లెక్కవేస్తే మరో రూ.10,800 కోట్లు వారికి లబ్ధి చేకూర్చామన్నారు. అలాగే అన్ని పదవుల్లో ముస్లిం సోదరులకు పెద్దపీట వేశామన్నారు. నలుగురిని ఎమ్మెల్సీలుగా, మరో నలుగురిని ఎమ్మెల్యేలుగా కూర్చోబెట్టగలిగామని, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్, మున్సిపల్, కార్పొరేషన్ చైర్మన్ పదవుల కేటాయింపులోనూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించామని, ఆంధ్ర ప్రదేశ్ మైనార్టీస్ కాంపోనెంట్ చట్టం సబ్‌ప్లాన్‌ను తీసుకుని వచ్చామని వివరించారు. అలాగే గతంలో హజ్ యాత్రకు వెళ్లాలంటే హైదరాబాద్ నుంచి వెళ్లే పరిస్థితి ఉండేదని అన్నారు. విజయవాడ నుంచి నేరుగా వెళ్లే పరిస్థితి రావాలన్న పట్టుదలతో విజయవాడను ఎంబార్కేషన్ పాయింట్ కింద ప్రకటించామని గుర్తు చేశారు. హజ్ యాత్రకు హైదరాబాద్ కంటే విజయవాడ నుంచి విమాన టికెట్ రూ.80 వేలు ఎక్కువగా ఉందని, ఈ విషయం ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా తనతో వచ్చి చెప్పగా, ఆ అదనపు భారాన్ని దాదాపు రూ.14 కోట్లు వెంటనే చెక్ ఇచ్చి కార్యక్రమాన్ని ముందుకు పోయేలా చేశామని తెలిపారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం పెంచామని, మొట్టమొదటిసారిగా గతంలో ఎన్నడూ లేని విధంగా పాస్టర్‌లకు కూడా రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్న ప్రభుత్వం కూడా మనదే అవడం గర్వంగా ఉందన్నారు.

వక్ఫ్ బోర్డు, ముస్లిం మైనార్టీ, చర్చిలకు సంబంధించిన ఆస్తుల సంరక్షణ కోసం ఏకంగా జీవో నంబరు 60 జారీ చేశామని, వీటి రక్షణ కోసం ఒక జీవో విడుదల చేసి, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు వేసిన తర్వాత సచివాలయంలో ఉన్న ప్లానింగ్ సెక్రటరీలకు ఇన్‌ఛార్జ్ ఫర్ ప్రొటెక్షన్ బాధ్యతలు అప్పగిస్తూ చర్యలు తీసుకున్నామని సీఎం జగన్ వివరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ రుహుల్లా, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలవరం సమస్యలు కొలిక్కి వచ్చేనా?

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణ రెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు తదితరులు పాల్గొననున్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల సీపేజీకి అడ్డుకట్ట వేయడం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తది నిర్మించాలా ? పాతదానికే మరమ్మతు చేయాలా ? వంటి అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. గోదావరి ప్రవాహాన్ని స్పిల్‌వే వైపు మళ్లించి ప్రధాన డ్యామ్ నిర్మించుకునే ప్రాంతంలో ఎలాంటి వరద తాకిడి లేకుండా ఎగువ, దిగువన కాఫర్ డ్యామ్‌లను నిర్మించారు. దీనివల్ల గోదావరికి స్వలంగా వరదలు వచ్చినప్పుడు కూడా ప్రధాన డ్యామ్ ప్రాంతంలో నిర్మాణ పనులకు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అయితే కాఫర్ డ్యామ్‌లను నిర్మించిన తర్వాత గోదావరికి వరద వచ్చినప్పటికీ ఈ డ్యామ్‌ల మధ్య కొంత సీపేజీ మినహా పెద్దగా ఎలాంటి సమస్య ఉండకూడదు. అలాంటిది ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీ అంచనాలకు మించి ఉంది. సుమారు 14 మీటర్ల నిరు నిల్వ ఉన్నప్పటికీ, ఎత్తిపోసుకోవడానికి అవకాశం ఉండగా, 19.72 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. దాదాపు 5 మీటర్ల నీటి నిల్వ అదనంగా ఉండడం డ్యామ్ భద్రతకు ప్రమాదంగా అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై ఏం చేయాలనే దానిపై ఈ సమావేశం నిర్ణయం తీసుకోనుంది. అలాగే ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తు వరకు సవరించిన అంచనాల ప్రకారం సీడబ్ల్యూసీ రూ.31,625.38 కోట్లుగా ఖరారు చేసింది. ఇందులో ఇప్పటికే రూ.16,119 కోట్ల పనులు పూర్తి కాగా, మిగిలిన పనులకు అవసరమైన నిధుల మంజూరుకు రాష్ట్ర జల వనరుల శాఖ నివేదిక పంపింది. తొలిదశ పూర్తయిన తర్వాత రెండో దశలో 45.72 డ్యామ్ ఎత్తు పెంపునకు అవసరమైన నిర్మాణానికి మరో రూ.16 వేల కోట్లు అవసరం అవుతుంది. ప్రస్తుతానికి తొలిదశ నిర్మాణం పూర్తికి మాత్రమే పోలవరం ప్రాజెక్టు అథారిటీ కూడా పరిమితమైంది. ఇందుకు సంబంధించి డయాఫ్రం వాల్, కాఫర్ డ్యామ్‌ల సీపేజీ, నిర్వాసితుల సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వానికి రావల్సిన రీయంబర్స్‌మెంట్ నిధుల అంశాలకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు 20వ తేదీ సమావేశంలో ప్రస్తావించి పరిష్కారం చేసుకోవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికనుగుణంగా ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

ధరల చిటపట

(మొదటిపేజీ తరువాయి)

సంపాదిస్తున్నప్పటికీ, ధరలు సమానంగా పెరిగినందున నిజంగా ఎటువంటి తేడా లేదు' అని ఒక గృహిణి ఆవేదన వ్యక్తం చేసింది. ఒక వారం అదనపు నిత్యావసరాలను కొనడం కూడా ఇప్పుడు కష్టంగా అనిపిస్తోంది. 10 సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని, ఇటీవలే మగబిడ్డకు జన్మనిచ్చిన ఒక ఉద్యోగ జంట, తాము కొత్తగా పెళ్లైనప్పుడు వారానికి రూ.2 వేలు ఖర్చు చేసేవారమని, కానీ ఇప్పుడు కిరాణా ఖర్చులు రెట్టింపు అయ్యాయని తెలిపారు. ఖర్చులకు తోడు కొడుకు పుట్టడంతో నిత్యావసర వస్తువులకు సైతం విపరీతంగా పెరిగిన ధరలతో ఖర్చుకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నారు. భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఇద్దరు పిల్లల తల్లి ఒకరు మాట్లాడుతూ కొంతకాలం క్రితం భోజన ఖర్చులకే రూ.5 వేలు సరిపోయేవని, ఇప్పుడు వారికి రూ.10 వేలు కూడా ఒక సవాలు మొత్తమేనని అన్నారు. 'ఒకప్పుడు కిలో రూ.60-80కి విక్రయించే పప్పులు ఇప్పుడు కిలో రూ.130-150కి అమ్ముడవుతున్నాయి. ఇది దాదాపు రెట్టింపు అవుతుంది' అని అన్నారు. 'ఉల్లిపాయల ధర చాలా అసంబద్ధం! కిలో రూ.25 కంటే తక్కువ ధరకు విక్రయించే వారు. ఇప్పుడు అది రూ.75కి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు రూ.10 రూపాయలకే టమాటోలు, బంగాళదుంపలు కూడా వచ్చేవి. ఇప్పుడాపరిస్థితి లేదన్నారు. కంది, మినపప్పు, పెసరపప్పు, పంచదార, చింతపండు, ఇతర దినుసుల ధరలు తారస్థాయికి చేరాయి. దేశంలో పెట్రోల్ ఉత్పత్తుల ధరలు 233 శాతం పెరిగాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 2024లో జాతీయ ఎన్నికలకు ముందు ధరలను తగ్గించడానికి రాబోయే నెలల్లో గోధుమలను దిగుమతి చేసుకోవలసి ఉంటుంది.

భారీగా పెరిగిన మినపగుళ్ల ధర

ఇడ్లీ.. దోసె.. గారె.. ఏదో ఒకటి లేకుండా ఉదయం అల్పాహారం ఉండదు. వీటి తయారీకి మినపగుళ్లు తప్పనిసరి. రెండు నెలల వ్యవధిలో కిలోకు రూ.40 పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. 20 రోజుల కిందట కిలో రూ.115 నుంచి రూ.130 మధ్య ఉండగా ప్రస్తుతం రూ.135 నుంచి రూ.150 వరకు ధరలు పలుకుతున్నాయి. బ్రాండ్లతో అమ్ముతున్న కంపెనీల మినపగుళ్లు కిలో రూ.200కు చేరువయ్యాయి. దేశ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల్లో మినుము సాగు విస్తీర్ణం తగ్గడం, చేతికి వచ్చే దశలో భారీ వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడులు పతనమయ్యాయి. దేశీయ అవసరాలకు మినుములు తగినన్ని లేకపోవడంతో బర్మా నుంచి పెద్దఎత్తున దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

దిగుబడులు తగ్గి పెరిగిన డిమాండ్

మన దేశంలో ఖరీఫ్ సీజన్‌లో మహారాష్ట్ర, కర్నాటక, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో మినుము పంట సాగు చేస్తారు. ఆయా రాష్ట్రాల్లో సెప్టెంబరు నెలాఖరు నుంచి దిగుబడులు ప్రారంభమై అక్టోబరు చివరి వరకు మార్కెట్‌కు వస్తాయి. ఈసారి వర్షాభావ పరిస్థితులు కొనసాగడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. మరోవైపు పంట చేతికి వచ్చే దశలో వచ్చిన భారీ వర్షాలతో పంట దెబ్బతింది. ఈ కారణంగా ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా దిగుబడులు పడిపోయాయి. మార్కెట్‌లో సరకు లభ్యత బాగా తగ్గింది. ఆయా రాష్ట్రాల్లో వచ్చిన పంట స్థానిక అవసరాలకే సరిపోవడంతో మిగిలిన ప్రాంతాల్లో మినుముల కొరత ఏర్పడింది. దీంతో మార్కెట్‌లో ధరలు పెరిగాయి. ఒక నెల తర్వాత రాష్ట్రంలోని నూజివీడు, తణుకు, రాజమండ్రి, పోలవరం పరిసర ప్రాంతాల్లో కొంత మినుము దిగుబడులు వస్తాయి. దీంతో పాటు రాష్ట్రంలో అక్కడక్కడా సాగు చేసిన పంట కూడా చేతికి వస్తుంది. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట స్థానికంగా అంతంతమాత్రంగానే ఉందన్న అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిగా దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ పంట దెబ్బతినడం, నిల్వలు తక్కువగా ఉండడం, ఇప్పట్లో కొత్త పంట వచ్చే అవకాశాలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం క్వింటా మినుములకు రైతులకు రూ.10,150 చెల్లిస్తున్నారు. రైతుల నుంచి సేకరించి శుద్ధి చేయడానికి మిల్లుకు తీసుకెళ్లేసరికి క్వింటా రూ.10,600 పడుతోంది. క్వింటా మినుములు శుద్ధి చేస్తే 78 నుంచి 80 కిలోల మినపగుళ్లు వస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో మినపగుళ్లు కిలో రూ.135 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. బర్మా నుంచి దిగుమతి చేసుకుంటున్న మినుములు క్వింటా రూ.10,100కు వస్తున్నాయి. అక్కడి నుంచి తెనాలి మిల్లులకు రవాణా చేసి శుద్ధి చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మినుముల ధర పెరుగుతున్నందున మినుపగుళ్ల ధర కొంత పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. వరి పొలాల్లో రెండో పంటగా డెల్టా ప్రాంతంలో మినుము సాగు చేస్తారు. ఈసారి ధర బాగున్నందున రబీ సీజన్‌లో మినుము సాగుకు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉంది. అయితే నీటి లభ్యతపై ఆధారపడి సాగు ఉంటుంది. ఏదేమైనా, ఆహార ద్రవ్యోల్బణంలో ఒక మోస్తరు పెరుగుదల కూడా ఓటర్లకు కోపం తెప్పిస్తుందని ఆర్థికవేత్త ధీరజ్ నిమ్ అన్నారు. ప్రభుత్వం నుంచి మరిన్ని చర్యలు అవసరమవుతాయని అన్నారు.

రాజధాని పేరుతో భూ దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా దానికి శంకుస్థాపన చేశారు. ఇది పెద్దలకు ఉత్తరాంధ్ర ఆస్తులను దోచిపెట్టడమేనని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు. రాజధాని పేరిట విశాఖలో రూ.40 వేల కోట్ల విలువైన భూములను గడిచిన నాలుగేళ్లలో వైసీపీ పెద్దలు, జగన్ అనుచరగణం దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ విధానాలు, కబ్జాలను ప్రశ్నించడానికి ప్రతిపక్ష టీడీపీ సైతం వెనుకాడుతోంది. జనసేన విమర్శలకే పరిమితమైంది తప్ప క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమం నిర్మించలేకపోయింది. ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు దశాబ్దాలుగా పూర్తికావడం లేదు. ప్రస్తుతం వర్షాభావంతో ఉత్తరాంధ్ర కరువుతో అల్లాడుతోంది. ఉన్న పరిశ్రమలు మూతపడి...కొత్త పరిశ్రమలు రాక ఉత్తరాంధ్రవాసులు వలసబాట పట్టారు. కానీ వలస రాజకీయ నాయకులు మాత్రం విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్రపై పెత్తనం సాగిస్తున్నారు. తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం, పునరావాసం దక్కలేదు. నిర్మాణం సైతం పూర్తికాలేదు. నాగవళి-వంశధార అనుసంధానం ప్రకటనలకే పరిమితమైంది. వంశధార నిర్వాసితుల సమస్య నేటికీ పరిష్కరించలేదు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో జూట్ మిల్లులు, సుగర్ ఫ్యాక్టరీలు, ఫెర్రో పరిశ్రమలతో పాటు అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం ప్రజలు కిడ్నీ వ్యాధులతో అల్లాడుతున్నా పట్టించుకున్న నాథుడు కనిపించలేదు. విభజన చట్టాన్ని, హామీలను అమలు చేయకుండా ద్రోహం చేసిన మోదీకి సీఎం జగన్, జనసేన అధినేత పవన్ భజన చేయడం ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేయడమే. అన్యాయాన్ని ప్రశ్నించడమే తన లక్ష్యమని, వామపక్ష భావజాలం తన నైజమని చెప్పుకున్న పవన్ కల్యాణ్ మోదీ జపం చేస్తున్నారు. మోదీకి మిత్రుడిగా ఉన్న పవన్...రాష్ట్ర సమస్యలను, ఉత్తరాంధ్ర సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఎందుకు పరిష్కరించడం లేదో అర్థం కావడం లేదు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ సైతం బీజేపీ, దాని అగ్రనాయకత్వాన్ని పల్లెత్తు మాట అనడం లేదు. పైగా బీజేపీతో పొత్తు కోసం ఆరాటపడుతోంది. రాష్ట్రంలో ఈ మూడు రాజకీయ పార్టీలు బీజేపీ దారిలోనే నడుస్తున్నాయి. వామపక్షాలు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై అలుపెరగని పోరాటం సాగిస్తున్నాయి. మూతపడ్డ పరిశ్రమలు తెరిపించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవాలని అనునిత్యం ఉద్యోగ, కార్మిక వర్గాల్లో చైతన్యం కలిగిస్తున్నాయి.

ఏలూరులో కౌలురైతుల ధర్నా

విశాలాంధ్ర -ఏలూరు: కౌలు రైతులకు రుణ పరపతి సౌకర్యం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏలూరులో జిల్లా లీడ్ బ్యాంకు అయిన యూనియన్ బ్యాంకు వద్ద రైతు, కౌలు రైతు సంఘం అధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం బ్యాంకు మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. ధర్నా చేస్తున్న వారినుద్దేశించి రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 26 లక్షల మంది కౌలు రైతులు ఉండగా ప్రభుత్వం కేవలం 5 నుంచి 6 లక్షలు మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. భూ యాజమాన్యం అంగీకార పత్రం తో సంబంధం లేకుండా అర్హత కలిగి ఉండి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణ పరపతి సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం కౌలు రైతులకు సరైన న్యాయం చేయని పక్షంలో సీపీఐ, రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షలకు పైగా కౌలు రైతులు ఉన్నారని కేవలం 60వేల మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారన్నారు. వీరిలో కేవలం 10వేల మందికి కూడా బ్యాంకు రుణ సౌకర్యం కల్పించలేదన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని కౌలు రైతులందరికీ రుణ పరపతి సౌకర్యం కల్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం యంత్రాంగం తక్షణం కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

10న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: డిసెంబర్ 10న విజయవాడ జింఖానా గ్రౌండ్ లో ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను నిర్వహించనున్నట్లు ఏపీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ వెల్లడించింది. రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రతి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఈ మహా సభకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. విజయవాడ రెవెన్యూ భవన్‌లో శనివారం జేఏసీరాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏపీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ కె. సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేశ్ బాబు అధ్వర్యంలో జరిగింది.

ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో చిరుద్యోగులైన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఏపీ జేఏసీ అమరావతి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మిగతా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి బి రామకృష్ణ,, వీఆర్ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా చింతలపూడి

అక్కినేని వనజ డిమాండ్

విశాలాంధ్ర- చింతలపూడి: ఏలూరు జిల్లా చింతలపూడిమండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. చింతలపూడి మండలంలో ఎండిపోయిన పొలాలను, వర్షాభావం తక్కువ వల్ల పండిన ధాన్యాన్ని పరిశీలన చేయడం కోసం పాత చింతలపూడి, సమ్మెట వారి గూడెం, మల్లాయగూడెం గ్రామాల్లో శనివారం సీపీఐ రాష్ట్ర బృందం పర్యటించింది. సమ్మిటివారిగూడెం గ్రామంలో పొలాల్లో పర్యటించి పెట్టిన పెట్టుబడి ఎంత? ఇప్పుడున్న పరిస్థితుల్లో పండిన ధాన్యం ఎంత..? అనే వివరాలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ సర్వే నంబర్ ఆధారంగా పంట నష్టపరిహారాన్ని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి జమలయ్య మాట్లాడుతూ వాతావరణం పరిస్థితులు వల్ల ఎకరానికి 30 బస్తాలు ధాన్యం దిగుబడి వచ్చే దానికి ఇప్పుడు పండిన ధాన్యం కేవలం 5 లేక 6 బస్తాల కన్నా ఎక్కువగా లేదన్నారు. పండిన ధాన్యాన్ని మొత్తం గ్రేడ్లతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఆర్బీకే ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మనవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి అయి ఉంటే ఈ రోజు చింతలపూడి మండలానికి ఇంత కరువు పరిస్థితి వచ్చేది కాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా పాత చింతలపూడిలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, సమితి సభ్యులు ఎస్ కె.మస్తాన్, ఏపీ రైతు సంఘం నాయకులు తక్కెళ్ల పాటి ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు, రావెళ్ల హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ దీక్షను జయప్రదం చేయండి

ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-కడప రూరల్: కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ తక్షణం రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు పీడిత మండలాల్లో సహాయక చర్యలు చేపట్టాలన్న డిమాండ్‌తో నవంబర్ 20, 21న విజయవాడలో జరిగే 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. దీక్షలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీపీఐ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రానికి 811 టీఎంసీల నీటిని కేటాయించగా విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించినట్లు తెలిపారు. మిగులు జలాల వాడుకపై సుప్రీంకోర్టులో వివాదం నడుస్తోందన్నారు. ఈ కేసు పెండింగ్‌లో ఉండగానే మోదీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా నీటి వివాదాన్ని మరింత జటిలం చేసిందని విమర్శించారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న సంకుచిత భావంతో నోటిఫికేషన్ విడుదల చేయడం ఆంధ్రప్రదేశ్‌కు, ప్రత్యేకించి రాయలసీమకు తీవ్ర అన్యాయం చేసే కుట్ర దాగి ఉందన్నారు. విభజన హామీలకు మోదీ సర్కారు తిలోదకాలు ఇచ్చిందని ఆరోపించారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్ కేంద్రాన్ని ప్రశ్నించలేకపోతున్నారని మండిపడ్డారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను జగన్ తాకట్టు పెడుతున్నారన్నారు. వర్షాభావం కారణంగా రాష్ట్రంలో 448 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తోందని, పంటల సాగు నిలిచిపోయిందని, అరకొర వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. వలసలు పెరిగాయని, మేతలేక పశువులను కబేళాలకు తరలిస్తున్నారని చెప్పారు. వేసవికాలం రాకముందే తాగునీటి ఎద్దడి ఆరంభమైందన్నారు. రాష్ట్రంలో ఎలినినో ప్రభావం వల్ల పూర్తిగా కరువు ఛాయలు అలుముకున్నాయన్నారు. కేవలం 103 మండలాల్లోనే కరువు ఉందని ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. ఎండిన పంటలకు నష్టపరిహారం, పంట సాగు వేయని రైతులకు పెట్టుబడి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు కె.మునయ్య, బి.దస్తగిరి, ఎస్‌కే మైనుద్దీన్, చైతన్య, నాగార్జున, పకీరప్ప పాల్గొన్నారు.

ఆర్టీసీ హౌస్‌లో అబుల్ కలామ్ అజాద్ జయంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ బస్ హౌస్‌లో శనివారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా అతిథిగా విచ్చేసి అజాద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం విద్య ప్రాముఖ్యత తెలియజెప్పారని, కుల-మత భేదాలకు తావివ్వకుండా అందరూ సమానత్వంతో బతకాలనే గొప్ప సందేశాన్ని ఇచ్చారని కొనియాడారు. చిన్న వయసులోనే పత్రికల ద్వారా, తన కవితల ద్వారా దేశభక్తిని రగిలించి, బ్రిటీష్ పరిపాలనపై ఎంతో పోరాటం చేసి సమాజంలో మార్పు తీసుకొచ్చారన్నారు. అలాంటి మహనీయులు అందరికీ స్ఫూర్తిదాయకమని, భావి తరాల కోసం మహనీయులు ఇచ్చిన సందేశాలను గ్రహించి ప్రతి ఒక్కరూ ఆచరించేలా కృషి చేస్తే, రాష్ట్రం తద్వారా దేశం పురోభివృద్ధి సాధిస్తాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీకి వివిధ విభాగాల అధికారులు బషీర్, స్వరూపానందరెడ్డి, సామ్రాజ్యం, శోభామంజరి, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

లూటీ కోసమే మితిమీరిన అప్పులు

- రూ.1.14 లక్షల కోట్లు సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లింపు
- శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాన్ని లూటీ చేయడం కోసమే వైసీపీ ప్రభుత్వం మితిమీరిన అప్పులు చేస్తోందని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్, క్రిసిల్ లాంటి సంస్థలు తీవ్రంగా హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టులో డాయిష్ బ్యాంకు ముఖ్య ఆర్థిక వేత్త కౌశిక్ దాస్ తన నివేదికలో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల్లో ఏపీ 8వ స్థానం నుంచి 11 వ స్థానానికి పడిపోయిందని చెప్పారు. నిన్న క్రిసిల్ రేటింగ్ సంస్థ అమరావతి బాండ్ల రేటింగ్‌ను తగ్గించింది. చేబదుళ్లు, ఓవర్ డ్రాఫ్టలతోనే ఆర్థిక నిర్వహణ చేసే స్థితికి దిగజారిందని చెప్పింది. జగన్ రెడ్డి దోపిడీ, దుబారాల వల్లే నేడు రాష్ట్రానికి ఈ దుస్థితి దాపురించింది. ప్రభుత్వ గ్యారెంటీలతో కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పుల సమాచారం కాగ్ అడిగినా ఆ లెక్కలు వెల్లడించడం లేదు. పబ్లిక్ అకౌంట్ నుంచి ఎంత మొత్తం రుణం ప్రభుత్వం వినియోగించుకుంటుందో కూడా చెప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వం వెల్లడిస్తున్న కుట్రపూరిత గణాంకాలను రాష్ట్రం ఆవిర్భవించాక ఎన్నడూ చూడలేదు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై, తలసరి ఆదాయంపై, అప్పులపై తప్పుడు లెక్కలను నిస్సిగ్గుగా పుస్తకాలు వేసి ప్రచారం చేస్తోంది. 2019-20లో వృద్ధి రేటు ఎక్కువగా చూపించుకోవడం కోసం టీడీపీ హయాంలో సాధించిన వృద్ధిరేటును తారుమారు చేశారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.6,80,332 కోట్లు (11.02 శాతం) స్థూల ఆదాయం అని ముందస్తు అంచనాల్లో ప్రకటించి 2018-19 ఆర్థిక సర్వే విడుదల చేశారు. ఈ జీడీపీని రూ.6,21,301 కోట్లకు (4.45) కుదించి 2019-20 ఎకనామిక్ సర్వేలో చూపించారు. 2018-19లో టీడీపీ సాధించిన జీడీపీ కన్నా 2019-20 లో రూ.53,718 కోట్లు తగ్గించి 11.02 శాతం వృద్ధి రేటును 5.36 శాతానికి కుదించారు. 2020-21 లో కోవిడ్‌తో పూర్తిగా పతనమైన ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రతికూల వృద్ధి రేట్లు నమోదయ్యాయి. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం రొయ్యలు, చేపలు ఎగుమతుల్లో దేశంలోనే 3 వ స్థానంలో నిలిచిందని తప్పుడు లెక్కలు చూపారు. కరోనా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు నిలిచిపోయి దారుణమైన పరిస్థితులు నెలకొంటే వైసీపీ ప్రభుత్వం మాత్రం ఏకంగా రూ.40 వేల కోట్లు మేర రొయ్యల ఎగుమతులు జరిగాయని నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లెవేసింది. ఈ తప్పుడు లెక్కలపై, రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేసి బహిరంగ చర్చకు రావాలని పిలిచినా వైసీపీ నుంచి ఎటువంటి స్పందనా లేదని యనమల విమర్శించారు. ఇక జగన్ రెడ్డి ఆర్థిక అరాచక పాలనతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తెచ్చిన అప్పులు, వడ్డీల చెల్లింపుల కోసం చార్జీలు, పన్నుల బాదుడు, సబ్ ప్లాన్ నిధుల దారిమళ్లింపుతో సామాజిక న్యాయం గొంతు కోస్తున్నారు. ఈ వర్గాలకు చెందిన రూ.1.14 లక్షల కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించారు. 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను కబ్జా చేసేందుకు జగన్ రెడ్డి ముఠా ప్రయత్నిస్తున్నది. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లను కోత కోసి 16,800 మందికి రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశారు. జగన్ రెడ్డి ఆర్థిక విధానాలతో, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల వల్ల 53 నెలల జగన్ రెడ్డి పాలనలో ఒక్కో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబంపై రూ.2,79,136 ల భారం అదనంగా పడిందని యనమల ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళా రిజర్వేషన్లు తక్షణం అమలుచేయాలి

దుర్గాభవాని డిమాండ్

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: మహిళలకు చట్ట సభల్లో మూడోవంతు రిజర్వేషన్లను 2024 ఎన్నికలకు ముందే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని డిమాండ్ చేశారు.ఇక్కడి సీఆర్ భవన్‌లో సమాఖ్య కర్నూలు జిల్లా 19వ మహాసభ జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో దుర్గాభవాని, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడారు. దుర్గా భవాని మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రచార ఆర్భాటం చేస్తోందన్నారు. ఒకవైపు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తూనే కేంద్రం దాని అమలుకు జన గణన, నియోజకవర్గాల పునర్విభజన, ఓబీసీ సబ్ కమిటీలతో ముడి పెట్టడం చూస్తే ఓట్ల కోసమే బిల్లును తెచ్చినట్లు అనిపిస్తుందని విమర్శించారు. బిల్లును 2029 తరువాత అమలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. బీజేపీ వాగ్దానం చెల్లని చెక్కులాగా ఉంది తప్ప మహిళకి ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వానికి మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే 33% రిజర్వేషన్ అమలు చేసి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని దుర్గాభవాని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు వచ్చిన తర్వాత మహిళలకు స్వేచ్ఛ లేదని, మహిళలపై విపరీతంగా దాడులు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను ప్రసన్నం చేసుకోవడానికి ఎన్నికల ముందు శుష్కవాగ్దానాలు చేస్తూ మహిళలను మభ్యపెడుతున్నారన్నారు. సంపూర్ణ మద్య నిషేధం, మహిళా రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్వర్యాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంపై కలిసికట్టుగా ఉద్యమ సాగించి మహిళల హక్కుల కోసం ఉద్యమిద్దామని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు మహిళల సమస్యలపై చర్చించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సమర శంఖం పూరించేందుకు నంద్యాలలో నవంబర్ 17, 18 ,19 తేదీల్లో జరిగే సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలు వేదికలు కానున్నాయన్నారు. బి గిడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు దాడులు పెరిగిపోయాయని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఈ కారణంగానే నిందితులు మరింత పెట్రేగిపోతున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకు లు లలితమ్మ, శ్రావణి రెడ్డి, అమినాబి, వరలక్ష్మి, ఈరమ్మ, వాణి, కే జయమ్మ, బీజే సువర్ణ, సరోజమ్మ, మహాదేవి, రాజేశ్వరి, కోటమ్మ, సోఫియా, జయమ్మ, మా దేవి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 8-10 తేదీల్లో రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

ఆహ్వాన సంఘం ఏర్పాటు: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జనవరి 8, 9, 10 తేదీలలో ధాన్యాగారానికి కేంద్రమైన రాజమండ్రి నగరంలో జరపనున్నామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు శనివారం స్థానిక అంబల సూర్యారావు భవన్‌లో రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జ్యోతి రాజు అధ్యక్షతన శనివారం జరిగింది కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభకు ముందే అన్ని జిల్లాల్లో జిల్లా మహాసభలు పూర్తి చేసుకోవాలన్నారు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ రైతులు, గ్రామీణ ప్రజల ఓట్ల కోసం రైతే రాజు అంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తు న్నారన్నారు. సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు నగర కార్యదర్శి కే కొండలరావు, పంతల నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, జట్ల సంఘం కార్యదర్శి సప్పరమణ, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి

- మౌలిక సూత్రాలను కాలరాస్తున్న పాలకులు
- రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సులో వక్తలు

విశాలాంధ్ర-ఒంగోలు: రాజ్యాంగం దేశ ప్రజలకు ఇచ్చిన హక్కులను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ హాల్లో శనివారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సులో భారత రాజ్యాంగ విశిష్టత అనే అంశంపై మాట్లాడారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అధ్యక్షత వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కరవది సుబ్బారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రచన జరిగి 75 సంవత్సరాలు గడిచినా, రాజ్యాంగ జ్ఞానం భారత ప్రజలకు నేటికీ అందకపోవడం శోచనీయమని అన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యాలయాలలో భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా రూపొందించాలన్నారు. అప్పుడే రాజ్యాంగంలోని జ్ఞానామృతాన్ని అందరూ పొందగలరని, రాజ్యాంగ విశిష్టత తెలిసేలా ప్రతి ఒక్కరూ చైతన్యవంతం కావాలన్నారు. దేశంలో రాజ్యాంగం సక్రమంగా అమలు జరిగిన నాడే ప్రజలందరికీ ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యం లభిస్తుందన్నారు. నేటికీ స్వాతంత్ర్యాన్ని కొందరు మాత్రమే స్వేచ్ఛగా అనుభవిస్తున్నారన్నారు. కుల వివక్ష రాజ్యమేలుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. దేశంలో ప్రజలకు ప్రశ్నించే హక్కు లేదన్నారు. పాలకులు రాజ్యాంగాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి అవగాహన చేసుకుని, తమ హక్కుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమానికి అతిథులను సభా పరిచయం చేసిన డాక్టర్ సంత వేలూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అనేక భాషలు, ఐక్యమత్యానికి రాజ్యాంగం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశానికి అందించారని తెలిపారు. కనుమాల రాఘవులు మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన రాజ్యాంగం భారతదేశంలో ఉందన్నారు. అందుకే దేశాన్ని అనేక రాజకీయ పార్టీలు, అనేకమంది నాయకులు పాలించినా ప్రజలకు సమానమైన పాలన దక్కుతుందన్నారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ రాజ్యాంగ కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు.

రాజ్యాంగంలోని మౌలిక అంశాలను సక్రమంగా అమలు చేసిననాడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. సింగంశెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం మహాగ్రంథం ప్రతి ఇంట కొలువై ఉండాలన్నారు. సీపీఐ నాయకులు ఎస్.డి.సర్దార్ మాట్లాడుతూ స్వతంత్ర ఫలాలు అందరికీ దక్కాలంటే రాజ్యాంగం సక్రమంగా అమలు కావాలన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, దాని స్థానంలో మనువాదాన్ని తీసుకువచ్చేందుకు కొంతమంది చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ దోనేపూడి కోటేశ్వరరావు, చిట్టితోటి సుధీర్, మెడబలిమి కోటేశ్వరరావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, చొప్పర జాలన్న, బి.హరికృష్ణ పాల్గొని మాట్లాడారు. మిడసల మల్లికార్జునరావు వందన సమర్పణ చేశారు.

వ్యవసాయ కార్మికులకు అండగా ఉంటా

జిల్లా మహాసభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

విశాలాంధ్ర- రావులపాలెం: వ్యవసాయ కార్మికులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మికులకు మౌలిక సదుపాయాలు, ఉపాధి హామీకి సంబంధించి జాబ్‌కార్డులు ఇవ్వడానికి తనవంత సాయమందిస్తానని, ఇందుకోసం ఆ సంఘం నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ మహాసభ కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలో శనివారం జరిగింది. దేవ రాజేంద్రప్రసాద్, పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేశ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. తొలుత రావులపాలెం జట్లు సంఘం కార్యాలయం నుండి వందలాది మంది వ్యవసాయ కార్మికులతో ప్రారంభమైన ర్యాలీ తాపీ మేస్త్రీల సంఘం భవనం వరకు కొనసాగింది. అనంతరం దేవ ముసలయ్య ప్రాంగణం వద్ద బీకేఎంయూ పతాకాన్ని రావులపాలెం జట్లు సంఘం అధ్యక్షుడు కర్రి రామిరెడ్డి ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వ్యవసాయ కార్మికుల సమస్యలు, పరిష్కారాలు, ప్రభుత్వం నుంచి సహకారం గురించి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 90 ఏళ్ల క్రితం వ్యవసాయ కార్మిక సంఘం ఆవిర్భవించిందన్నారు. అనేక పోరాటాల ద్వారా వ్యవసాయ కార్మికులకు హక్కులు సాధించిందన్నారు. వ్యవసాయ కూలీల రక్షణ కోసం కోనేరు రంగారావు భూ కమిటీ చేసిన సిఫార్సులు అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తోందని గుర్తుచేశారు. వ్యవసాయ కూలీల కోసం సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుంటున్నామన్నారు. కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడానికి నూతన కమిటీ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు, సీనియర్ నాయకులు డాక్టర్ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, నిమ్మకాయల శ్రీనివాస్, సమితి సభ్యులు శ్యామ్, గోపాల్, రామిరెడ్డి, విజయ్, సీహెచ్ ప్రసాద్, లక్ష్మణరావు సహా 200 మంది వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఉత్తేజ పరిచే గేయాలతో అలరించారు.

ANDHRA PRADESH STATE GOVERNMENT EMPLOYEES MUTUALLY AIDED COOPERATIVE HOUSE BUILDING SOCIETY LIMITED
(REGD. NO.AMC/KNA/DCO/2016/122)
D.No.54-16-3/3, Plat No.48, Loyola gardens colony, Road No.3, Opp: Loyola College, VIJAYAWADA - 520 008, Krishna District, A.P.,

NOTICE

The powers conferred under Resolution No.03, Dated: 05.11.2023 of the Board meeting of the above Society, the under signed has appointed Sri. M.Nagendra Sagar Babu, B.A. LLB, S/o Kondala Rao, Advocate, Vijayawada (cell No.90109 61085) as Election officer vide proceeding No. ELECTIONS /2/2023/PRE-1, Dated: 06.11.2023 for conducting of elections of five (5) Director posts of the Society. The Schedule for elections (short notice) is as follows:
1) Publication of draft voters list, calling claims & objections from: 20.11.2023 10.00 AM to 27.11.2023 03.00 PM 2) Publication of voters list after rectification of claims & objections filed by members on: 28.11.2023 at 10.00 AM 3) Final list of voters shall be handed over to Election officer by under signed on: 30.11.2023
4) Election Notice shall be published by Election officer in Form-I along with voters list on 30.11.2023
5) Date of polling, counting of votes, declaration of results on: 30.12.2023
6) Place of Elections: Malineni Nageswara Rao A/c Library Hall, NTR & Veterinary colony Association Vijayawada - 8, NTR District (nearly 1/2 KM distance from Society Regd. office)
All eligible voter members of the Society are requested to file claims & objections if any on voters list to under signed following said schedule. The claims received after the prescribed period including postal delay if any will not be allowed & will be rejected, For further details contact the under signed during office hours.

Sd/- Addala Subba Raju, President

Ref: ELECTIONS /2/2023/PRE-6, Dated: 11.11.2023

సంపాదకీయం

నైతిక కమిటీ అనైతికత

లోకసభ నైతిక ప్రమాణాల కమిటీ తొమ్మిదవ తేదీన సమావేశమై తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలని సిఫార్సు చేసింది. అయితే మహువా మొయిత్రా మీద ఆరోపణలు చేసిన నిశికాంత్ దుబేను ప్రశ్నించే అవకాశం ఇవ్వకుండానే బహిష్కరించాలన్న నిర్ణయం తీసుకుంది. అదానీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారికి లోకసభలో సభ్యత్వం లేకుండా చేయాలన్న మోదీ ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే నైతిక ప్రమాణాల కమిటీ నిర్ణయం తీసేసుకుంది. ఇంకా విచిత్రమేమిటంటే ఈ నివేదికను లోకసభ స్పీకర్‌కు అందజేయడానికి ముందే అది అదానీ యాజమాన్యంలోని ఎన్.డి.టీవీకి అందింది. అయితే మోదీని, అదానీని ప్రశ్నించే వారి మీద కక్ష తీర్చుకోవడమే ప్రధాన అంశంగా తయారైన ఈ దశలో ఇలాంటి మర్యాదలను పట్టించుకోకపోవడంలో ఎంతమాత్రం ఆశ్చర్యం లేదు. మొయిత్రాపై సీబీఐ దర్యాప్తు చేయాలని లోక్‌పాల్ ఆదేశించిందని బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ప్రకటించడం విచిత్రాతి విచిత్రం. మొయిత్రా మీద వచ్చిన ఆరోపణలపై 'న్యాయపరమైన, లోతైన, వ్యవస్థాపరమైన, నిర్ణీత కాలావధికి లోబడి సీబీఐ విచారణ చేయాలని నైతిక ప్రమాణాల కమిటీ సిఫార్సు చేసింది' అని చెప్పారు. అంటే అసలు ఆరోపణల మీద విచారణ జరగక ముందే మొయిత్రాను బహిష్కరించాలని సిఫార్సు చేయడంలో ఆంతర్యం ఏమిటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. లోకసభలో అదానీ వ్యవహారంలో ప్రశ్నలు అడగడానికి మొయిత్రా డబ్బు తీసుకున్నారన్నది అసలు ఆరోపణ. ఈ ఆరోపణల నిగ్గు తేల్చకుండానే బహిష్కరణ ఉత్తర్వు జారీ అయిపోయింది. నైతిక ప్రమాణాల కమిటీ చైర్మన్, లోకసభలో బీజేపీ సభ్యుడు వినోద్ కుమార్ సోంకర్ అధ్యక్షతన గల ఈ కమిటీలో మొత్తం 15 మంది సభ్యులు ఉంటే నిర్ణయం తీసుకున్న రోజున 11 మంది మాత్రమే హాజరయ్యారు. ఆరుగురు సభ్యులు కమిటీ నిర్ణయానికి అనుకూలంగాను, నలుగురు వ్యతిరేకంగానూ ఓటు వేశారు. మొయిత్రా బహిష్కరణకు అనుకూలంగా సస్పెండ్ అయిన కాంగ్రెస్ ఎంపీ ప్రణీత్ కౌర్ ఓటు వేశారు. నలుగురు ప్రతిపక్ష సభ్యులు కమిటీ నిర్ణయంపై లిఖితపూర్వకంగా అసమ్మతి రికార్డు చేశారు. అదానీకి వ్యతిరేకంగా లోకసభలో ప్రశ్నలు అడగడానికి వ్యాపారవేత్త దర్శన్ హీరనందానీ నుంచి మొయిత్రా డబ్బు, బహుమతులు తీసుకున్నారని బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే, సుప్రీంకోర్టు న్యాయవాది జై అనంద్ దేహద్ రాయ్ ఆరోపించారు. దర్శన్ హీరనందానీ వ్యాపారంలో అదానీకి పోటీదారు అన్న వాదన ఉంది. అదానీతో పోలిస్తే హీరనందానీ చాలా చిన్నవ్యాపారి కింద లెక్క. హీరనందానీని ప్రశ్నించే అవకాశం మొయిత్రాకు ఇవ్వలేదు. మొయిత్రాను బహిష్కరించాలని సిఫార్సు చేయడానికి అతి తక్కువ సమయంలో 500 పేజీల నివేదిక అయితే తయారుచేశారు. ఇంత తక్కువ సమయంలో అన్ని పేజీల నివేదిక సిద్ధం అయిందంటే నైతిక కమిటీ విచారణకు ముందే నివేదిక సిద్ధం చేసేపని మొదలై ఉండాలి. మొయిత్రా తన లోకసభ లాగ్ ఇన్ ఐ.డీ., పాస్‌వర్డ్ హీరనందానీకి అందించారని, ఇది సభాహక్కుల ఉల్లంఘనే అని ఆరోపించారు. అయితే పార్లమెంటు సభ్యులు ప్రశ్నలు అడగడానికి వివిధ వర్గాల నుంచి సమాచారం అంది ఉండవచ్చు. సాధారణంగా పార్లమెంటు సభ్యులకు తమ పనిలో సహాయపడే సిబ్బందికి ఈ ఐ.డి.లు, పాస్‌వర్డులు తెలియజేస్తూనే ఉంటారు. అందులో విచిత్రం ఏమీలేదు. హీరనందానీ కార్యాలయం ప్రశ్నలు తయారుచేసి మొయిత్రాకు అందించేది. ఇందులోనూ పెద్దగా అభ్యంతర పెట్టవలసింది ఏమీ లేదు. హీరనందానీకి తన లోకసభ ఐ.డి., పాస్‌వర్డ్ అందించిన మాట నిజమేనని మొయిత్రా బాహాటంగానే అంగీకరించారు. మొయిత్రా డబ్బు తీసుకుని లోకసభలో ప్రశ్నలు అడిగారన్నది ఆమె మీద ఉన్న ప్రధాన ఆరోపణ. ఈ అంశాన్ని నైతిక ప్రమాణాల కమిటీ విచారించి నిగ్గు తేల్చనే లేదు. విచారణ జరిపే బాధ్యతను ప్రభుత్వానికి వదిలేసింది. నిబంధనల ప్రకారం కమిటీ అధ్యక్షుడు మొదట లోకసభ స్పీకర్‌కు నివేదిక పంపించాలి. దాన్ని బయటపెట్టాలో లేదో స్పీకర్ నిర్ణయిస్తారు. కమిటీ అధ్యక్షుడు ఈ నివేదికను వచ్చే పార్లమెంటు సమావేశాలలో సభలో ప్రతిపాదించాలి. దాని మీద చర్చ జరగాలి. ఇదేమీ జరగకుండానే నైతిక ప్రమాణాల కమిటీ మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలని సిఫార్సు చేసేసి ఆ విషయం స్పీకర్‌కు నివేదించడానికి ముందే అదానీ యాజమాన్యంలోని టీవీ చానల్‌కు ఉప్పందించింది. ఇది అక్రమం. అన్యాయం. నిబంధనలకు వ్యతిరేకం. మరీ చెప్పాలంటే సభా హక్కుల ఉల్లంఘనే. సభలో చర్చ జరిగిన తరవాత సదరు వ్యక్తిని బహిష్కరించాలని సభ తీర్మానించాలి. అప్పుడు గానీ బహిష్కరణ సాధ్యం కాదు. కానీ బీజేపీ ఎంపీ అధ్యక్షతన ఉన్న కమిటీ ఈ ప్రక్రియను ఏ మాత్రం పాటించకుండా తమ సిఫార్సును బట్టబయలుచేసి మొయిత్రాను ఇరకాటంలో పెట్టడమే కాక ఆమెను అపఖ్యాతి పాలు చేయడానికి చేయాల్సిందంతా చేసింది. మోదీని ప్రశ్నించే వారిని, ఆయన మిత్రుడు అదానీ పాల్పడే అవకతవకలను లేవనెత్తే వారిని సభలో లేకుండా చేయడానికి మోదీ ప్రభుత్వం ఎంతకైనా దిగజారుతుందని రాహుల్ గాంధీ లోకసభ సభ్యతం ఆఘమేఘాల మీద రద్దు చేసినప్పుడే రుజువైంది. ఆ తరవాత సుప్రీంకోర్టు రాహుల్ సభ్యత్వ రద్దును తిరగతోడింది. ఈ ప్రక్రియ అంతా పూర్తి అయి సభ్యత్వం రద్దు అయితే మొయిత్రా కోర్టుకు వెళ్లే అవకాశం ఎటూ ఉంటుంది.

నిష్పక్షపాతంగా ఆ కమిటీ వ్యవహరిస్తే ఆమె మీద ఫిర్యాదు చేసిన వారిని విచారించడానికి ముందే మొయిత్రాను పిలిచి మాట్లాడాలి. అదీ జరగలేదు. కానీ ఫిర్యాదు చేసిన వారిని ముందు పిలిచి మాట్లాడడం నిబంధనలకు విరుద్ధం అని అనేకమంది ఎంపీలు భావిస్తున్నారు. మొయిత్రాను విచారించినప్పుడు సైతం నైతిక కమిటీ సభ్యులు అప్రస్తుత, అవమానకరమైన ప్రశ్నలు అడగడం మరో వైపరీత్యం. ఫిర్యాదుదారును ఆరోపణలకు గురైన వ్యక్తి కన్నా ముందు పిలవడాన్ని కమిటీ సభ్యుల్లో కొందరు అభ్యంతరం పెట్టారు. సభా హక్కుల ఉల్లంఘన కమిటీ విచారణ జరిపే సందర్భాల్లోనూ ఆరోపణలకు గురైన వారిని ముందు విచారిస్తారు. మొయిత్రా విషయంలో మాత్రం మొదటి సమావేశం సమయంలోనే ఫిర్యాదు దారులైన నిశికాంత్ దుబేను, న్యాయవాది జై అనంత్ దేహాద్ రాయ్‌ని పిలిచి మాట్లాడారు. నైతిక కమిటీ అధ్యక్షుడు విచారణ సమయంలో అడిగిన ప్రశ్నలు, మాట్లాడిన మాటలు ముందే రాసి ఉన్న కాగితాలలోంచే చదివారు. అంటే విచారణ ఫలితం ఎలా ఉన్నా మొయిత్రాను శిక్షించాలన్న సంకల్పం ముందే ఉందనుకోవాలి. నైతిక కమిటీ విచారణ ఇంత అనైతికంగా సాగడం వింతే.

ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యం

ఇటీవల ఢిల్లీలో గాలి నాణ్యత సూచిక (ఎ.క్యు.ఐ.) అధికం కావడంతో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఎ.క్యు.ఐ అనేది గాలి నాణ్యత సూచిక. ఇది ఒక ప్రాంతంలో ప్రస్తుతం గాలి ఎంత కలుషితమై ఉందనే దాని సూచిక విలువ తెలియజేస్తుంది. గాలి కాలుష్యం మన ఆరోగ్యంపై ఎంతమేర ప్రభావం చూపుతాయో ఈ సూచిక ఆధారంగా తెలుసుకోవచ్చు. గాలిలోఉన్న ఎనిమిది ప్రధాన కాలుష్యకారకాల ఉద్గారాలను కొలవడం ద్వారా గాలినాణ్యత సూచికను పొందవచ్చు. గాలిలో పి.యం 2.5, పి.యం 10 లను కొలవడం ద్వారా గాలి నాణ్యతను తెలుసుకోవచ్చు. ఇది క్యూబిక్ మీటరుకు మైక్రోగ్రాములలో కణాలను కొలుస్తుంది. ఇది గాలిలోఉండే ఘన కణాలు, ద్రవ బిందువుల మిశ్రమం. పి.యం అంటే పర్టిక్యులర్ మేటర్. ఓజోన్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, లెడ్, అమ్మోనియా ఉద్గారాలు. వీటి రీడింగ్‌లు ప్రతి గంటకు గుర్తిస్తారు. ప్రతి దేశం వాయునాణ్యతా ప్రమాణాల ఆధారంగా వాయు నాణ్యత సూచికలను కలిగిఉంటుంది. పి.యం గణనీయమైన కాలుష్య కారకం. ధూళి, పొగ, మసి వంటి కొన్ని కణాలు మన కళ్ళకు కనిపిస్తాయి. మరికొన్ని ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ ద్వారా మాత్రమే కనిపిస్తాయి. పవర్ ప్లాంట్లు, పరిశ్రమలు, ఆటోమొబైల్స్ మొదలైన వాటి ద్వారా విడుదలయ్యే కాలుష్య కారకాలు గాలిలో సంక్లిష్ట రసాయన ప్రతిచర్యలను ఏర్పరుస్తాయి. తద్వారా రేణువులు ఉత్పత్తి అవుతాయి.

వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు 1981లో వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ)చట్టం ఆమోదించడమైంది. నిబంధనలు సరిగా అమలుకాక కాలుష్యాన్ని తగ్గించడంలో ఈ చట్టం విఫలమైంది. 2014లో ఐ.ఐ.టి కాన్పూర్ నిపుణుల బృందం భారతదేశానికి ఎ.క్యూ.ఐ పథకాన్ని సిఫార్సు చేసింది. 2015సం.లో భారత ప్రభుత్వం ఐ.ఐ.టి కాన్పూర్‌తో కలిసి నేషనల్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌ను ప్రారంభించింది. డిసెంబరు 2019 సం.లో ఐ.ఐ.టి ముంబై, సెయింట్‌లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్శిటీకి చెందిన మెక్‌కెల్వీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ భాగస్వామ్యంతో భారతదేశంలో వాయు కాలుష్యాన్ని అధ్యయనం చేయడానికి ఏరోసోల్, ఎయిర్ క్వాలిటీ రీసెర్చ్ ఫెసిలిటీని ప్రారంభించింది. నేషనల్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఆరు ఎ.క్యూ.ఐ కేటగిరీలను ఏర్పాటుచేసింది. సామాన్యులు తమ పరిసరాల్లోని గాలి నాణ్యతను అంచనా వేయడానికి ఒక సంఖ్య- ఒక రంగు ఒక వివరణగా ఇది ఉంటుంది. ఎ.క్యూ.ఐ విలువ-కేటగిరీ, ఆరోగ్యంపై దాని ప్రభావం వరుసగా ఇలా ఉంటుంది. 0%-50% మంచిది- కనిష్ట ప్రభావం. 51%-100% సంతృప్తికరం-సున్నితమైన వ్యక్తులకు చిన్న శ్వాస అసౌకర్యం కలిగించవచ్చు. 101%-200% మధ్యస్థం-ఉబ్బసం వంటి ఊపిరితిత్తుల వ్యాధి ఉన్నవారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె జబ్బులు ఉన్నవారికి పిల్లలు వృద్ధులకు అసౌకర్యం కలిగించవచ్చు. 201%-300% పూర్-దీర్ఘకాలం ఎక్స్‌పోజర్‌లో ఉన్న వ్యక్తులకు శ్వాసతీసుకోవడంలో అసౌకర్యం, గుండెజబ్బులు ఉన్నవారికి అసౌకర్యం కలిగించవచ్చు. ఊపిరితిత్తులు, గుండె జబ్బులు ఉన్నవారిలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. గాలినాణ్యత మానిటర్లు నిర్దిష్ట కాలుష్య కారకాలను గుర్తించేందుకు రూపొందించిన సెన్సార్‌లు అమరుస్తారు. లేజర్‌లను, శాటిలైట్ ఇమేజింగ్‌లను ఉపయోగిస్తూ క్యూబిక్ మీటర్ గాలిలో నలుసు పదార్థాల సాంద్రతను గణిస్తారు. వాయు నాణ్యత డేటా బ్యాంకులు సమగ్ర ఎ.క్యు.ఐ రీడింగ్‌ను నమోదు చేయడానికి ప్రభుత్వ క్రౌడ్-సోర్స్, శాటిలైట్-డిరైవ్డ్ ఎయిర్ క్వాలిటీ మానిటర్‌లనుండి రీడింగ్‌లను ప్రాసెస్ చేస్తాయి. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ఐ.క్యు ఎయిర్ సహకారంతో 2021లో మొట్టమొదటి నిజ-సమయ వాయుకాలుష్య ఎక్స్‌పోజర్ కాలిక్యులేటర్‌ను అభివృద్ధి చేసింది. ఇది 117 దేశాల భూభాగాలు, 6,475 స్థానాల్లో ధృవీకరించిన గాలి నాణ్యత మానిటర్‌ల నుండి గ్లోబల్ రీడింగ్‌లను మిళితం చేసింది. ఈ డేటాబేస్ పి.యం 2.5 రీడింగ్‌లకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి దేశ జనాభా వాయు కాలుష్యానికి గురికావడాన్ని గంటల ప్రాతిపదికన లెక్కించడానికి కృత్రిమ మేధస్సును వర్తింపజేస్తుంది. వాయుకాలుష్య కారకాల ఉద్గారాల పెరుగుదల, భారీ ట్రాఫిక్ లేదా అడవుల దహనసమయం కారణంగా ఎ.క్యూ.ఐ పెరుగుతుంది. యాంటీసైక్లోన్ లేదా ఉష్ణోగ్రత విలోమం కారణంగా గాలి స్తబ్దత, గాలిలో కాలుష్య కారకాలు అధిక సాంద్రతలకు దారితీస్తుంది. మబ్బుగాఉన్న పరిస్థితుల మధ్య రసాయన ప్రతిచర్యలకు కలుగ జేస్తుంది. తద్వారా ఎ.క్యూ.ఐ పెరుగుతుంది. ఇంధన చెక్క ముక్కలు, ఎండుగడ్డి, ఆకులు, పశువులపేడ వంటి తడి మిశ్రమం నుండి తయారుచేసే వంట, ఇంధనాలు, గోధుమలను నాటడానికి భూమిని త్వరగా సిద్ధంచేయడానికి పంటకోత తర్వాత అవశేషాలను కాల్చడం, బయోమాస్ బర్నింగ్, టైర్ పైరోలిసిస్ ప్లాంట్లు, ఇంధన కల్తీ, ట్రాఫిక్ రద్దీ వంటి వాటివలన వెలువడే కాలుష్య కారకాలు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించుకోవాలి. ప్లాస్టిక్, సింథటిక్ వస్తువులను నిషేధించాలి. విరివిగా చెట్లునాటాలి. కాగితాల నుండి డిజిటల్‌కి మారాలి. పర్టిక్యులేట్ మాటర్ ఎక్కువగాఉండే ఎయిర్ ఫ్రెషనరులు, డియోడరెంట్లు వాడకం తగ్గించాలి. గ్యాసోలిన్ యంత్రవాడకాన్ని పరిమితం చేయాలి. ఎనర్జీ స్టార్‌సర్టిఫికేట్ పొందిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఎంచుకోవాలి. కాలుష్య కారకాల ఉత్పత్తులను తగ్గించుకోవాలి.

జనక మోహనరావు దుంగ
ఫోన్: 8247045230

శాంతా? స్వాతంత్ర్యయోధుడి తుపాకీనా?



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

శాంతి కావాలో, స్వాతంత్ర్య యోధుని తుపాకి కావాలో నిర్ణయించమని విశ్వ సమూహాన్ని అరఫాత్ సవాలు చేశారు. 49 ఏళ్ల క్రితం అమెరికా, ఇజ్రాయిల్ దౌత్య ఓటమి చెందాయి. పలస్తీనా, ఐక్యరాజ్యసమితి గెలిచాయి. 13.11.1974న పలస్తీనా విమోచన సంస్థ (పి.ఎల్.ఒ.) అధ్యక్షుడు యాసర్ అరఫాత్ ఐరాస సర్వసభ్యసభలో నాటకీయంగా ప్రవే శించారు. "క్రైస్తవులు, యూదులు, ముస్లింలు ప్రగతి, సౌభ్రాతృత్వం, న్యాయం, సమానతలతో కలిసి జీవించగల ప్రజాస్వామ్య దేశం కోసం పి.ఎల్.ఒ. కలలు కంటోంది, ఆశిస్తోంది. తన స్వీయ సంకల్ప సాధన పోరాటంలో పలస్తీనియన్లకు అండగా నిలవమని సర్వసభ్య సభకు విజ్ఞప్తి చేస్తోంది. (శాంతి సంకేత) ఆలివ్ కొమ్మను ఒక చేత్తో, స్వాతంత్ర్య యోధుని తుపాకిని మరొక చేత్తో పట్టుకొని వచ్చాను. నా చేతి నుండి ఆలివ్ కొమ్మను పడనివ్వకండి." అని అరఫాత్ విన్నవించారు.

ఐరాస సమావేశ మందిరాల్లో తమ నాయకుని ఉనికి పలస్తీనియన్లకు ఆనందాన్ని కలిగించింది. ఏళ్ల తరబడి పలస్తీనియన్లకు ప్రత్యేక దేశ గుర్తింపును నిరాకరించిన అమెరికా, ఇజ్రాయిల్‌లు ఐరాసలో అరఫాత్ రాకను వ్యతిరేకించాయి. పలస్తీనియన్లను ప్రజలుగా కాక శరణార్థులుగానో, తీవ్రవాదులుగానో గుర్తించాలన్నాయి. భద్రతామండలి 22.11.1967లో ఆమోదించిన 242వ తీర్మానం శాంతి సాధన కోసం, యుద్ధంలో తాను ఆక్రమించిన ప్రాంతాలను వదలమని ఇజ్రాయిల్‌ను కోరింది. కాని పలస్తీనియన్లను శరణార్థులుగానే ప్రస్తావించింది. 1968లో ఇజ్రాయిల్ ప్రధాని గోల్డా మీర్ పలస్తీనియన్లే లేరన్నారు. అయితే 1968 నుండి పోరాట హక్కు, స్వీయ నిర్ణయాధికారాలతో సహా పలస్తీనియన్ల విడదీయరాని హక్కులను గుర్తిస్తూ ఐరాస అనేక తీర్మానాలను చేసింది. అమెరికా, ఇజ్రాయిల్‌లు వాటికి వ్యతిరేకంగా ఓటేశాయి. అరబ్-ఇజ్రాయిల్ శాంతి చర్చల్లో పలస్తీనియన్ అరబ్బుల న్యాయమైన కోర్కెలను తీర్చాలి.

1948లో ఇజ్రాయిల్ ఏర్పడగానే 7.5లక్షల పలస్తీనియన్లు పలస్తీనాను విడిచి పారిపోయారు. పలస్తీనియన్లకు ప్రత్యేకదేశ కల్పన ఉద్దేశంతో 1964 లో ఈజిప్టు రాజధాని కైరోలో అరబ్ లీగ్ శిఖరాగ్ర సమావేశంలో పి.ఎల్.ఒ. స్థాపించారు. ఇజ్రాయిల్‌కు ఉత్తరాన ఉన్న మధ్య ఆసియా దేశం లెబనాన్ కేంద్రంగా పి.ఎల్.ఒ. పనిచేసింది. 1969 నుండి 2004లో మరణించే వరకు సైనిక నాయకుడు యాసర్ అరఫాత్ పి.ఎల్.ఒ. అధ్యక్షునిగా పనిచేశారు. ఇజ్రాయిల్‌పై ప్రత్యక్ష దాడులకు పరిమితమవుతామని 1974లో అరఫాత్ ప్రకటించారు. అప్పుడు అరబ్ దేశాలు పి.ఎల్.ఒ.ను పలస్తీనియన్ల ఏకైక చట్టబద్ధ ప్రతినిధిగా గుర్తించాయి. 1976లో అరబ్ లీగ్‌లో కలుపుకున్నాయి. 1974లో అరబ్ దేశాలు పి.ఎల్.ఒ.ను గుర్తించినా అమెరికా గుర్తించలేదు. అరబ్బులకు, యూదులకు వారి వారి భూమిపై ఒకే రకమైన ప్రాథమిక హక్కులున్నాయని 1988లో పోప్ అరఫాత్‌ను వాటికన్‌లో స్వాగతించారు. 1989 మొదటి వారంలోనే 70 దేశాలు 'కొత్త' పలస్తీనా దేశాన్ని గుర్తించాయి. నార్వే రాజధాని ఓస్లోలో అరఫాత్, ఇజ్రాయిల్ ప్రధాని యిట్జక్ రాబిన్‌ల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయి. ఈ శాంతి కృషికి వీరిద్దరికీ కలిపి 1994 నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఈ ఒప్పందాలలో పలస్తీనా నేషనల్ అథారిటి ఏర్పాటయింది. 13.09.1993న ఇజ్రాయిల్ గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలపై పలస్తీనియన్లకు సర్వాధికారాన్ని ఇచ్చింది. తర్వాత అమెరికా పి.ఎల్.ఒ.ను గుర్తించింది. 1996లో జరిగిన ఎన్నికల్లో అరఫాత్ పలస్తీనా అథారిటి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అయితే ఆయన ప్రజాస్వామ్యం లోప భూయిష్టంగా ఉందని విమర్శలు ఉన్నాయి.



2006లో పలస్తీనా శాసనమండలి ఎన్నికల్లో ముస్లిం సున్నీ, సమరశీల బృందం హమాస్, పి.ఎల్.ఒ. బహుళపక్ష బృందం ఫతాపై ఆధిక్యత సాధించింది. ఈ రెండు సంస్థల మధ్య 2007లో హింసాయుత ఘర్షణ జరిగింది. గాజా యుద్ధంలో హమాస్ ఫతాను ఓడించింది. ఫలితంగా వెస్ట్‌బ్యాంక్‌లో ఫతా పాలన కొనసాగింది. గాజా హమాస్ పాలన కిందికి వచ్చింది. 2014లో హమాస్, ఫతాలు కలిసి ఏకీకృత జాతీయ పలస్తీనియన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఐరాస సర్వసభ్య సభ 2012లో పలస్తీనాను సభ్యత్వంలేని పరిశీలన దేశంగా ఓటేసింది. ఫలితంగా పలస్తీనాకు ఐరాస సర్వసభ్య సభలో చర్చల్లో పాల్గొనే అవకాశం లభించింది. పి.ఎల్.ఒ.కు 2015 లో అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో సభ్యత్వం ఇచ్చారు. ప్రస్తుతం మహ్మద్ అబ్బాస్ పి.ఎల్.ఒ., పలస్తీనా అథారిటీలకు అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. ఈయన సాపేక్షికంగా హద్దులకులోబడి పనిచేసే నాయకునిగా పేరుపొందారు. అంత ర్జాతీయంగా పలస్తీనాకు ప్రత్యేక దేశం హోదా గుర్తింపుకోసం పి.ఎల్.ఒ. కృషిచేస్తోంది. ఇజ్రాయిల్- పలస్తీనా రెండు దేశాల కొనసాగింపు పలస్తీనా సమస్యకు సరైన పరిష్కారం. కాని ఇది అమెరికా, ఇజ్రాయిల్‌లకు ఇష్టంలేదు. 2017లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తటస్థ దేశం జెరుసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించారు. ఇది అరబ్బులు, వారి మిత్ర దేశాలకు ఆగ్రహం తెప్పించింది.

తీవ్రవాదికి, విప్లవకారునికి తేడా ఉంది. వారి పోరాట లక్ష్యాలు వేరు. తమ పంతాన్ని నెగ్గించుకోడానికి, తమ భావాలను రుద్దడానికి, హింసావాదం, ఉద్రేకాలతో ఇతరులను భయపెట్టి ఆక్రమణలతో, వలసవాదంతో, అణచివేత, యుద్ధచర్యలతో మానసిక ప్రతిచర్యలకు పాల్పడేవారు, సమాజ వ్యతిరేక మార్గాలను ఎంచుకునేవారు తీవ్రవాదులు. వారి పంతం, భావాలు సరైనవి కావచ్చు, కాకపోవచ్చు. న్యాయమైన లక్ష్యాల కోసం నిలబడి, ఆక్రమణదారులు, వలసవాదుల నుండి స్వేచ్ఛ, విముక్తులకోసం పోరాడేవారు విప్లవకారులు. వీరి గమనగమ్యాలు, కార్యక్రమాలు బలహీనుల పక్షాన న్యాయం, సమానత్వాల కోసం ఉద్దేశించి ఉంటాయి. ఇజ్రాయిల్ పలస్తీనా భూభాగాలను ఆక్రమించింది. వారి హక్కులను హరించింది. హింసకు, హత్యలకు పాల్పడింది. మాటలతో, చేతలతో అడుగడుగునా భయాలకు గురిచేసింది. ఇజ్రాయిల్ దుశ్చర్యలకు అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ వంటి సామ్రాజ్యవాద దేశాలు వత్తాసు పలికాయి. ఐరాస వ్యవస్థాపక ఒప్పందం 12 వ అధ్యాయం ప్రకారం అంతర్జాతీయ శాంతి భద్రతల రక్షణ, ఉల్లంఘన, ఆక్రమణ, యుద్ధ నివారణకు భద్రతా మండలి సైనిక, నిస్సైనిక చర్యలు తీసుకోవచ్చు. అయినా అంతర్జాతీయ సంస్థలు మౌనం వహించాయి. ఈ వేదికలపై పలస్తీనియన్లకు నమ్మకం పోయింది. కేవలం రాజకీయ ప్రక్రియలతో ఇజ్రాయిల్ ఆక్రమించిన పలస్తీనా భూమిలో ఒక యించిని కూడా తిరిగి పొందలేమన్న నిర్ధారణకు వచ్చారు. గత్యంతరం లేక సాయుధ పోరాటానికి దిగారు.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
సంచారవాణి: 9490204545

నాటి దీప దానోత్సవమే నేటి దీపావళి

డాక్టర్ దేవరాజు మహారాజు

దీపావళి అంటే దీపాల వరుస. చుట్టూ ఉన్న చీకట్లను పారద్రోలి వెలుగు నింపడానికి సంకేతంగా ఆ పండగ చేస్తున్నామని చెపుతారు. చెడు మీద మంచి సాధించిన విజయం అని కూడ చెపుతారు. అయితే, దాని చుట్టూ అల్లుకున్న పౌరాణిక గాథలు చాలా ఉన్నాయి. శ్రీకృష్ణుడు, నరకాసురుడితో యుద్ధం చేస్తున్న సమయంలో సొమ్మసిల్లి పోయాడనీ, పక్కనే ఉన్న సత్యభామ ఉగ్రరూపం దాల్చి, బాణాల వర్షం కురిపించి నరకాసురుణ్ణి సంహరించిందనీ- ఒక పౌరాణిక గాథ ఉంది. మహాకాళి రాక్షస సంహారం చేసినందుకు దేవీ నవరాత్రులు జరుపుకుంటున్నట్లు మరో కథనం ఉంది. ఇవికాక, దశ-హరా (దసరా)కు, దీపావళికి దగ్గర సంబంధం ఉంది. ఆ రెండు పండగలు వెంట వెంటనే వస్తాయి. రాముడు లంకాధీశుడైన పది తలల రావణుణ్ణి చంపినందువల్ల దసరా జరుపుకుంటున్నామని చెపుతారు. దశ-హరా అంటే పది తలలు నరికేయడం. రావణుడి పది తలలు నరికి సంహరించిన తర్వాత, రాముడు సీతా లక్ష్మణులతో సహా అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భాన్ని దీపావళిగా జరుపుకుంటున్నామని కథ చెపుతారు. పౌరాణిక గాథలు బావున్నాయి కాని, పురాణ పాత్రలు చనిపోతే, విజయం సాధిస్తే పండగలు జరుపుకోవడం ఏమిటీ? ఇందులో ఉన్న అసలు మతలబు ఏమిటీ? విషయం తెలుసుకోవాలన్న ఉత్సుకత, గతాన్ని అవలోకనం చేసుకోగల సామర్థ్యం, ఓపిక ఉంటే నిజాలు బయటపడతాయి. మన పెద్దవాళ్లు చెప్పారనో, జరుపుకోవడం మన ఆచారం అనో, ఆనవాయితీ అనో...కల్పితగాథల ఆధారంగా అనాలోచితంగా జరుపుకుంటే జరుపుకోవచ్చు. కానీ, వాస్తవం వేరే ఉంది. సాహిత్య రచనల్లో పాత్రల మధ్య యుద్ధాలు జరగొచ్చు. కొట్లాటలు జరగొచ్చు. ఓ పాత్ర విజయం సాధించొచ్చు. మరో పాత్ర పరాజయం పొందొచ్చు. అంత మాత్రానికి ప్రజలు ఉబ్బితబ్బిబై పండగలు జరుపుకోవాలా? పురాణ పాత్రలు మరణిస్తే పండగలు, వేడుకలు జరుపుకోవడం ఎందుకూ? ఒకవేళ ప్రపంచం మొత్తానికి సంబంధించింది అయితే, అప్పుడు ప్రపంచ దేశాలన్నీ కలిసి జరుపుకునేవి. కానీ, భారతదేశంలోని దాదాపు అన్ని పండగలు పురాణాల్లోని రాక్షసుల మరణాలపైనే ఎందుకు జరుపుకుంటున్నారూ? ఆలోచించాలి కదా? రాముడు ఆర్యుడు. బయటి నుండి వచ్చిన ఆర్యులకు ఇక్కడి మూలవాసులైన ద్రావిడులకు మధ్య జరిగిన సంఘర్షణల్ని పురాణాలుగా రాసుకున్నారని పెరియార్ చెప్పారు. ఇక్కడి మూలవాసుల్ని కోతులుగా, రాక్షసులుగా చిత్రించి, ఆర్యులు అవమానించారని కూడా ఆయన చెప్పారు. ఉత్తర భారతదేశంలో పండగలని 'త్యౌహార్' అని అంటారు. హిందీలో తూహారా- అంటే "నువ్వు పరాజితుడివయ్యావు"- అని అర్థం! రావణుడు, నరకాసురుడు వగైరా ఎవరు పరాజితులైనా పండగ జేసుకోవడానికి ఈ పదం వాడుతారు. ఎదుటి వారి (శత్రువు) పరాజయాన్ని లేదా మరణాన్ని ఒక ఉత్సవంగా జరుపుకోవడమే- త్యౌహార్. పురాణాలన్నీ బుద్ధుడి తర్వాత రాసుకున్నవేనని- బౌద్ధాన్ని నాశనంచేసే క్రమంలో రాశారని రూఢిగా తెలిసిపోయింది. పుష్యమిత్ర శృంగుడిని దృష్టిలో ఉంచుకుని రాముడి పాత్రకు రూపకల్పన జరిగిందని స్పష్టమైంది. మరి ఇక్కడ ఈ దీపావళికి అసలు కారణమేమిటి? దానిని ముందు ఏమని పిలిచేవారు? అది ప్రజా జీవనంలోకి ఎలా వచ్చింది? అసలు కారణం తెలుసుకోవాలంటే మనం గౌతమ బుద్ధుడి విషయాలు లేదా అతని మార్గాన్ని అవలంబించిన చక్రవర్తి అశోకుడి విషయాలు మాట్లాడుకోవాలి. సిద్ధార్థుడు బుద్ధుడైన తర్వాత, తన నగరమైన కపిలవస్తు పురానికి వెళ్లలేదు. తండ్రి శుద్ధోధనుడు బుద్ధుణ్ణి ఒప్పించి తీసుకురావల్సిందిగా కొంతమందిని పంపాడు. వారు బుద్ధుడిని అన్వేషిస్తూ వెళ్లారు. కానీ, అతడి ప్రభావానికిలోనై ఆయనతో పాటే ఉండిపోయారు. తండ్రి శుద్ధోధనుడు మనుషుల్ని పంపుతూనే ఉన్నాడు. కాని, వెళ్లిన వారు వెళ్లినట్లు బుద్ధుడి దగ్గరే బౌద్ధ భిక్కులుగా ఉండిపోతున్నారు. అలా పదిహేడు సంవత్సరాలు గడిచిపోయాయి. చివరకు ఎలాగో బుద్ధుడు తన నగరానికి బయలుదేరాడు. ఆయన వస్తున్నాడని తెలిసి స్వాగతం పలకడానికి పుర ప్రజలు సంసిద్ధులయ్యారు. అప్పటికి వర్షాకాలం అయిపోయింది. వరదలకు కొట్టుకొచ్చిన చెత్తాచెదారం వీధుల్లో ఉంది. వర్షాలకు నాని ఇళ్లు నిమ్ముగా అయ్యాయి. ప్రజలు వీధులు, ఇళ్లు శుభ్రం చేసుకుని, గోడలకు వెల్ల వేసుకుని, గుమ్మాలకు పూల మాలలు వేలాడేసుకుని సర్వాంగ సుందరంగా అలంకరించుకున్నారు. ఆరోజు అమావాస్య గనక, నగరమంతా దేదీప్యమానంగా దీపాలు వెలిగించారు. ఉన్నవారు లేనివారికి మంచి ఆహారం అందించారు. దీపాలు దానం చేశారు. అదే దీప దానోత్సవంగా స్థిరపడింది. దీపం అంటే జ్ఞానానికి సంకేతం. ప్రాణానికి సంకేతం. జ్ఞానవంతుడై ప్రపంచానికి జ్ఞానాన్ని వెదజల్లిన బుద్ధుడి రాకకు సంకేతమే దీప దానోత్సవం. బుద్ధుడు తన జ్ఞానాన్ని ప్రపంచానికి దానం చేశాడని చెప్పడానికి ప్రతీకే ఈ దీపాలు వెలిగించడం. ఇది చరిత్రకు సంబంధించిన విషయం గనుక ఆధారాలు ఉంటాయి. పురాణ సంఘటనలకు చారిత్రక ఆధారాలు ఉండవు. అందుకే లక్ష్మిగణేశ్ పూజకు, నరకాసుర వధకు ఎక్కడ ఏ ఆధారమూ దొరకదు. దీప దానోత్సవం అంటే జ్ఞాన దానోత్సవంగా మనం అర్థం చేసుకోవాలి. ఆలోచిస్తే ఇది సబబుగా తోస్తుంది. వైదిక ధర్మ ప్రబోధకులు ప్రచారం చేసినవి అన్నీ కల్పించిన కట్టుకథలని తెలుస్తూనే ఉంది. శ్రీకృష్ణుడు, నరకాసురుడు, సత్యభామ, లక్ష్మి గణేశుడు అన్నీ పురాణాల్లో కల్పించిన పాత్రలు. వాస్తవంగా ఈ దేశం మీద పుట్టి పెరిగిన వారుకాదు. బుద్ధుడు కపిలవస్తుకు తిరిగి రావడాన్ని రాముడు అయోధ్యకు తిరిగి రావడంగా మార్చి రాసుకున్నారు. భ్రమల్ని నమ్ముతూ బతికేవారితో మనకు గొడవలేదు. వారి భ్రమల్ని మనం నమ్మాలంటేనే గొడవ. అది జరిగే పనికాదు. "దీప దానోత్సవం" అంటే మన ఇంటి వెలుగుని ఇతరులక్కూడా పంచడం. మన జ్ఞానాన్ని ఇతరులక్కూడా పంచడం అనేది ఒక్కడ ప్రతీకగా తీసుకోవాలి. పదిహేడేళ్ల తర్వాత తిరిగి వచ్చిన సాఖ్యముని తథాగతుని మనస్ఫూర్తిగా ఆనందంగా ఆహ్వానించడమే- దీప దానోత్సవమైంది. సామాన్య శకానికి (బీసీఈ) ముందు జరిగిన ఒక సంఘటన అది. ఇందులో భ్రమలు, కల్పితాలూ లేవు. బుద్ధుడు వాస్తవంగా ఈనేల మీద తిరిగినవాడు. బుద్ధుడి కరుణను, దయా గుణాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధులు ఈరోజు వరకు ఆ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నారు. బుద్ధుడి తర్వాత చాలాకాలం గడిచిపోయింది. మౌర్య చక్రవర్తి అశోకుడి (304- 232 బీసీఈ) కాలం వచ్చింది. ఆయన ఈ దేశ మూలవాసి. బహుజనుడు. మౌర్య అనేది మోర్- నెమలి. వారి అధికారిక పక్షి వల్ల వచ్చింది. ఆయన కళింగ యుద్ధంలో విజయం సాధించాడు. పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరిగినందుకు, లక్షల మంది నిరాశ్రయులైనందుకు విజయ గర్వంతో ఆయన వేడుకలు చేసుకోలేదు. ఆత్మ విమర్శ చేసుకున్నాడు. పశ్చాత్తాపంతో దుఃఖించాడు. ఆయుధాలు త్యజించి అహింసను ఆహ్వానించాడు. హింసాత్మకంగా విజయాలు సాధించి వేడుకల్ని చేసుకున్న చక్రవర్తులు ప్రపంచ చరిత్రలో ఉన్నారు. కాని, విజయానికి కుంగిపోయి, యుద్ధాన్ని త్యజించి, శాంతిని ఆహ్వానించిన ఒకే ఒక్క మహనీయుడు అశోక చక్రవర్తి. మానసిక పరివర్తనవల్ల తను చేసిన రక్తపాతానికి పరితపిస్తూ బౌద్ధ మార్గం స్వీకరించాడు. అలాంటి సందర్భంలో శోకతప్త హృదయంతో సంతాప దినాలు ప్రకటించాలి. కానీ ఆయన అలా చేయలేదు. అంధకారాన్ని పారద్రోలే దీపాలు వెలిగించమన్నాడు. వేల వేల దీపాలతో ప్రజల జీవితాల్లో శాంతి, అహింస, సత్యం, నిజాయితీ, నిబద్ధత, నైతికతలు వెలిగిపోవాలని ఆకాంక్షించాడు. దీప దానోత్సవ వివరాలన్నీ పాళీ భాషలో రాసిన శ్రీలంక బౌద్ధ గ్రంథంలో లభించాయి. దాన్ని మన భారతీయుడు డాక్టర్ వాల్మికి ప్రసాద్ "దీప్ వంశ్" - పేరుతో హిందీలోకి అనువదించారు. ఇదే కాకుండా ఇరానియన్ మేధావి, యాత్రికుడు, ఆంత్రపాలజిస్ట్, పరిశోధకుడు అయిన అబూ రేహాన్ అల్-బిరూనీ (973-1048 సీఈ) తన "అల్-బిరూనీ క భారత్"- అనే గ్రంథంలో దీప దానోత్సవ విశేషాలు నమోదు చేశారు. ఆయన విదేశీయుడు. ఆయన గమనించిన విషయాలే ఆయన నమోదుచేసి ఉంటారు. ఆ పుస్తకం రాసేనాటికి మన దేశంలో ఇప్పుడు ప్రచారంలో ఉన్న పౌరాణిక గాథలేవీ లేవు. అందుకే ఆయన రాయలేదు. ఆ కాలంలో దీప దానోత్సవాన్ని- దీప దానోత్సవమనే పిలిచేవారు. అది బౌద్ధ ధమ్మం అవలంభించే వారికి ఒక పర్వదినం! ఆ గ్రంథం అనేక ప్రపంచ భాషల్లోకి వెళ్లింది. డా॥అంబేద్కర్ మిత్రుడు సత్‌రామ్ బీన్ దాన్ని హిందీలోకి అనువదించారు. ఆ గ్రంథంలోని 530 పేజీలో దీప దానోత్సవం గురించి వివరంగా రాశారు. ఇవేకాక మనకు మరొక ఆధారం ఉంది. వేదాలు నాలుగింటికి తన వ్యాఖ్యానం జోడించి ప్రకటించిన గంగాశరణ్ శర్మ ఒక మాట చెప్పారు. వైకల్పిక ప్రకాశ్- వేదాలలో ఎక్కడా లేదు"- అని నిర్ధారించారు. వైకల్పిక అంటే కల్పించిన- ప్రకాశ్ అంటే వెలుగు. అంటే మనిషి తన బుద్ధిని ఉపయోగించి రూపొందించిన వెలుగు-కొవ్వొత్తి, లాంతరు, దీపం, ఎలక్ట్రిక్ బల్బు ఏదైనా కావొచ్చు. సూర్యుడు, చంద్రుడు ప్రకృతి సిద్ధంగా వెలుగునిచ్చేవి. మనిషి తన జ్ఞానంతో వెలిగించిన దీపాల ప్రసక్తి వేదాలలో లేదు అని శర్మ చెప్పారు. అందువల్ల దీపం బౌద్ధ సాహిత్యంలోంచి వచ్చిందే. బుద్ధుడే స్వయంగా "అత్ దీపోభవ" అన్నాడు. అంటే 'నువ్వే దీపం అవ్వు' అని అర్థం!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

కశ్మీర్ మంచు సోయగాలు కనువిందు

పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న లోయ ప్రాంతం

శ్రీనగర్ : కశ్మీర్‌లోని లోయ ప్రాంతంలో కురుస్తున్న ముందస్తు మంచు పర్యాటకులకు కనువిందు చేస్తోంది. మంచు సోయగాలను చూసి వారు ఆనందానుభూతి పొందుతున్నారు. గుల్‌మార్గ్, కశ్మీర్‌లోని ఇతర ప్రాంతాలలో ప్రారంభ హిమపాతం పర్యాటక రంగాన్ని మెరుగుపరిచింది. ఎందుకంటే పర్యాటకులు సుందరమైన దృశ్యాలను అనుభవించడానికి లోయకు వస్తున్నారు. ఇక్కడ శరదృతువులో రాలిపోయే క్రిమ్సన్ చినార్ ఆకుల మాయాజాలాన్ని చూసేందుకు వచ్చిన అనేక మంది పర్యాటకులు గురు, శుక్రవారాల్లో తెల్లవారుజామున కురుస్తున్న మంచు కారణంగా తెల్లటి గుల్‌మార్గ్‌ను సందర్శించి ఆశ్చర్యానుభూతలలో తేలియాడుతున్నారు. వాతావరణం మారుతోందని విన్నప్పుడు మేము శ్రీనగర్‌లో ఉన్నాము. అందువల్ల మేము ఇక్కడకు వచ్చి లోయ సుందరమైన అందాలను చూశాము. మీరు స్వర్గాన్ని చూడాలంటే అది కశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో ఉందని చెప్పడం తప్పు కాదు. మేము గొప్ప అనుభూతి చెందుతున్నాము' అని దిల్లీకి చెందిన పర్యాటకుడు మంజర్ ఖాన్ పీటీఐకి చెప్పారు. ఒడిశాకు చెందిన అసిమ్ కుమార్ రౌత్ మాట్లాడుతూ 'ఇక్కడికి వచ్చిన తర్వాత మేము ఆనందించాము. మేము మంచును ఆశిస్తున్నాము. కానీ మా జీవితంలో మొదటిసారి చూసిన హిమపాతం కాదు' అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాగా, హిమపాతం తర్వాత గుల్‌మార్గ్‌కు వెళ్లే పర్యాటకులు మంచు నిర్మాణాలు చేయడం కనిపించింది. స్లైడింగ్, స్కేటింగ్, మంచుతో కప్పబడిన పర్వతాల చిత్రాలను ఫొటోలు, వీడియోలు తీయడం ద్వారా వారికి సరదాగా, ఉల్లాసంగా ఉంది. 'నేను మొదటిసారి కశ్మీర్‌కు వచ్చాను. దీనిని భూమిపై స్వర్గం అని పిలుస్తారు. ఈ రోజు నేను దానిని స్వయంగా చూశాను. మేము పహల్గామ్, సోన్మార్గ్ వెళ్లాము. ఈ రోజు మేము గుల్మార్గ్ వచ్చాము. అది ఒక అందమైన లోయ. నేను ఇక్కడ మొదటిసారి హిమపాత అందాలను వీక్షిస్తున్నాను' అని పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుహైల్ అహ్మద్ చెప్పారు. పూణే నివాసి ప్రవిధా కశ్మీర్ ఆతిథ్యం అందరి ప్రశంసలు పొందింది. దాని మనోజ్ఞతను అనుభవించడానికి ప్రతి ఒక్కరూ లోయను సందర్శించాలని కోరారు. 'నేను మొదటి సారి కశ్మీర్ వచ్చాను. త్వరలో మళ్లీ సందర్శించాలనుకుంటున్నాను. నేను ఇక్కడ నా జీవితంలో మొదటిసారిగా హిమపాతాన్ని చూశాను. ఇది ఫొటోలు లేదా వీడియోల నుంచి మీరు అనుభవించలేనిది, మీరు తప్పక ఈ ప్రాంతాన్ని సందర్శించండి. ఇక్కడ స్థానికులు కూడా చాలా మంచివారు. సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, అందరూ చాలా మంచివారు. సహాయకారిగా ఉన్నారు. కశ్మీరీ ఆహారం కూడా చాలా అద్భుతమైనదని నేను నమ్ముతున్నాను' అని ఆమె చెప్పింది. 'కశ్మీర్ మనం ఊహించిన దానికంటే వంద రెట్లు మెరుగ్గా ఉంది. మనం స్వర్గానికి వచ్చినట్లు ఉంది. ఇక్కడి ప్రజలు అద్భుతమైనవారు, వారు కూడా చాలా సహకరిస్తారు' అని గుజరాత్ నుంచి వచ్చిన ఒక పర్యాటకుడు చెప్పాడు. ప్రారంభ హిమపాతం కశ్మీర్‌కు గమ్యస్థానంగా మంచి 'నోటి మాట' ప్రచారాన్ని కల్పించింది. దీంతో ప్రయాణ వాణిజ్యంతో అనుబంధించబడిన స్థానికులు ఈ శీతాకాలంలో మంచి వ్యాపారాన్ని ఆశిస్తున్నారు. 'పండుగ సెలవులు పర్యాటకుల రాకపోకలకు మంచి అవకాశంగా మారాయి. మా అతిథుల నుంచి మాకు లభించిన స్పందనలు మెరుగైన శీతాకాలం కోసం మాకు ఆశాజనకంగా ఉంది' అని టూర్ ఆపరేటర్ షోయబ్ అలీ అన్నారు.

సీతారాములే ఆదర్శ దంపతులు : జావేద్ అక్తర్

ముంబై: ప్రేమకు, వివాహ బంధానికి సీతారాములే నిదర్శమని, ఆదర్శ దంపతులు అని చెప్పడానికి ఆ జంటే ఉత్తమమైందని బాలీవుడ్ గేయ రచయిత జావేద్ అక్తర్ అన్నారు. మహారాష్ట్ర నవనిర్మాణ్ సేనా చీఫ్ రాజ్ థాకరే ముంబైలో నిర్వహించిన దీపోత్సవ కార్యక్రమంలో అక్తర్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మతం, రాజకీయాలపై తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పే జావెద్ అక్తర్ సీతారాముల జంట గురించి అద్భుతమైన విషయాలను చెప్పారు. ఎంతో మంది దేవుళ్లు ఉన్నారని, కానీ ఆదర్శవంతమైన భార్యాభర్తల గురించి చెప్పినప్పుడు, మన మెదళ్లలోకి సీతారాములే గుర్తుకు వస్తారని, ప్రేమ బంధానికి ఇంతకన్నా గొప్ప ఉదాహరణ ఏదీ లేదని అక్తర్ అన్నారు. హిందూ మతంలో ఉన్న సాంస్కృతిక ప్రాముఖ్యతను ఆయన తెలిపారు. హిందువుల్లో సహనశక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. హిందువుల్లో కరుణ ఎక్కువ అని, పెద్ద మనసుతో వ్యవహరిస్తారని చెప్పారు. హిందూ మతమే ప్రజాస్వామ్య విలువల్ని నేర్పిందని, అందుకే ఈ దేశంలో ప్రజాస్వామ్యం సజీవంగా ఉందన్నారు. మనమే కరెక్టు, మిగితావాళ్లంతా తప్పు అన్న భావన హిందువుల్లో ఉండదన్నారు. రాముడు, సీత కేవలం దేవుళ్లు మాత్రమే కాదు అని, భారతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు అని జావెద్ అక్తర్ ప్రశంసించారు.

హరియాణాలో కల్తీ మద్యానికి 19 మంది బలి

చండీగఢ్: హరియాణాలో దారుణం జరిగింది. కల్తీ మద్యం తాగి 19 మంది మృతిచెందారు. యమునానగర్, అంబాలా జిల్లాలో ఉన్న కొన్ని గ్రామాల్లో ఈ మరణాలు నమోదు అయ్యాయి. దీంతో స్థానిక గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. లిక్కర్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో సంబంధంవుందని అనుమానిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మండేబరి, పంజెతో కా మజ్రా, ఫూస్‌ఘర్, సరన్ గ్రామాల్లో మరణాలు సంభవించాయి. మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి. ప్రస్తుతం పోలీసులు అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంబాలా జిల్లాలో యూపీకి చెందిన ఇద్దరు కార్మికులు గురువారం కల్తీ మద్యం తాగి మరణించారు. ఒక నిషేధిత ఫ్యాక్టరీలో తయారు చేస్తున్న మద్యానికి చెందిన సుమారు 200 డబ్బాలను పోలీసులు సీజ్ చేశారు. మద్యం తయారీకి వాడిన వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఉమ్మడి పౌరస్మృతి అమలుకు ఉత్తరాఖండ్ సిద్ధం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేయనున్నారు. దేశంలో యూసీసీని అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలువనున్నది. వచ్చే వారం నుంచి యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ)ని ఉత్తరాఖండ్ అమలు చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రిటైర్డ్ జస్టిస్ రంజన్ దేశాయ్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికను సీఎం పుష్కర్ సింగ్ ధామికి అందజేయనున్నారు. దీపావళి తర్వాత ఉత్తరాఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నారు. ఆ సమావేశాల్లో ఉమ్మడి పౌర స్మృతికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి. యూసీసీ ముసాయిదా కమిటీలో సభ్యుడైన జస్టిస్ రంజన్ దేశాయ్ ఇటీవల మాట్లాడుతూ ఉమ్మడి పౌర స్మృతికి చెందిన నియమావళి ముసాయిదాని పూర్తి చేసినట్లు తెలిపారు. ఆ ముసాయిదా తీర్మానాన్ని పూర్తి చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. నిపుణుల కమిటీ ఇచ్చే నివేదికతో పాటు తీర్మానాన్ని కూడా ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి అందజేయనున్నట్లు జస్టిస్ దేశాయ్ తెలిపారు. ఉత్తరాఖండ్ బాటలోనే గుజరాత్ కూడా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే యూసీసీని అమలు చేసేందుకు గుజరాత్ ఆసక్తిగా ఉన్నట్లు భావిస్తున్నారు. దీంతో యూసీసీని అమలు చేసిన రెండవ రాష్ట్రంగా గుజరాత్ నిలువబోతుంది. యూసీసీతో బహుభార్యత్వాన్ని రద్దు చేయనున్నారు. సహజీవనం చేయాలనుకున్న వారు నమోదు చేసుకోవాలన్న నిబంధన పెట్టే అవకాశాలు ఉన్నాయి.

దిల్లీ సీఎస్‌పై తీవ్ర ఆరోపణలు

న్యూదిల్లీ: దిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్‌పై భూములకు సంబంధించి తీవ్ర ఆరోపణలు వచ్చాయి. 41 కోట్ల ఖరీదైన భూమిని ఆయన 315 కోట్లకు అమ్మారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై దిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఫిర్యాదు అందింది. విజిలెన్స్ మంత్రి ఆతిశ్‌కు ఫిర్యాదును అందజేశారు. తన కుమారుడు పనిచేస్తున్న కంపెనీకి ఆ భూమిని అమ్మినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనపై వచ్చిన ఆరోపణలను సీఎస్ ఖండించారు. ఈ కేసులో తానే చర్యలు తీసుకున్నానని ఆయన చెప్పారు. నగరంలోని 19 ఎకరాల భూమిని 2018లో జాతీయ రహదారుల సంస్థ కొనుగోలు చేసింది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే కోసం ఆ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి ధరను 41 కోట్లుగా జిల్లా మెజిస్ట్రేట్ నిర్ణయించారు. కానీ జిల్లా మెజిస్ట్రేట్ హేమంత్ కుమార్ ఆ భూమి విలువను 353 కోట్లకు పెంచేశాడు. భూయజమానులకు అధిక మొత్తం చెల్లించాలని దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జాతీయ రహదారుల సంస్థను ఆదేశించినట్లు ఫిర్యాదులో తేలింది. భూయజమాని సుభాశ్ చంద్ర కతురియాతో రియాల్ ఎస్టేట్ వ్యాపారి అమన్ సారిన్‌తో సంబంధాలున్నాయి. అయితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమారుడు కరణ్‌తో సారిన్‌కు సంబంధాలున్నాయని భావిస్తున్నారు.

సూరత్ స్టేషన్‌లో ప్రయాణికుడి మృతి

రైలు కోసం భారీ రద్దీ, గందరగోళం...

సూరత్ : గుజరాత్‌లోని సూరత్ రైల్వేస్టేషన్‌లో శనివారం విషాదం చోటుచేసుకుంది. రైలు కోసం జనం పరుగులు తీసిన సందర్భంలో ఒక ప్రయాణికుడు మృతి చెందడంతో పాటు మరికొందరు అస్వస్థతకు గురయ్యారు. రాబోయే ఛత్ పండుగ కోసం బీహార్‌కు వెళ్లే ప్రత్యేక రైలులో ప్రయాణికులు ఎక్కుతున్నప్పుడు ఏర్పడిన గందరగోళం కారణంగా 40 ఏళ్ల వ్యక్తి మరణించగా, ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. ఉదయం సూరత్ రైల్వే స్టేషన్ నుంచి తపతి గంగా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ప్రయాణీకులు పరుగులు తీశారు. ఈ క్రమంలో కొంత మంది వ్యక్తులు స్పృహతప్పి పడిపోయారని పోలీసు సూపరింటెండెంట్ (పశ్చిమ రైల్వే) సర్జో కుమారి తెలిపారు. రైల్వే స్టేషన్‌లో విపరీతమైన రద్దీ ఉందని, దీని కారణంగా కొంతమంది ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని, వారు స్పృహ తప్పి పడిపోయారని ఆమె చెప్పారు. ప్రయాణీకులలో ఒకరికి గుండె పోటు రావడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే ముందు ప్లాట్‌ఫారమ్‌పై ఉన్న ఒక పోలీసు అతనికి సీపీఆర్ చేశాడని అధికారి వివరించారు. కాగా బాధితుడిని అంకిత్ వీరేంద్ర సింగ్‌గా అధికారులు గుర్తించారు. 'ఒక వ్యక్తి రద్దీ కారణంగా పడిపోయాడు. చనిపోయినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టంలో మృతికి కచ్చితమైన కారణం తెలుస్తుంది. మరో ఇద్దరు ప్రయాణికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. వారు చికిత్స పొందుతున్నారు' అని స్మిమ్మర్ హాస్పిటల్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ జయేష్ పటేల్ తెలిపారు. సూరత్‌లోని వజ్రాలు, వస్త్ర పరిశ్రమలలో నిమగ్నమైన చాలా మంది కార్మికులు ఛత్ పూజ కోసం బీహార్, ఉత్తర ప్రదేశ్‌లోని వారి స్వస్థలాలకు వెళతారు.

నవ్‌సారిలో విలేకరులతో మాట్లాడిన హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి, బీహార్‌కు వెళ్లే రైలులో ఎక్కడానికి ప్లాట్‌ఫారమ్‌పై ప్రయాణికుల సంఖ్య అకస్మాత్తుగా పెరగడంతో గుంపును నియంత్రించడానికి పోలీసులు తమ వంతు ప్రయత్నం చేశారని అన్నారు. త్వరలో రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తానని మంత్రి తెలిపారు. పండుగ సీజన్‌లో రద్దీ దృష్ట్యా సూరత్, ఉధ్నా నుంచి ప్రత్యేక రైళ్లను నడపడం, భద్రత, రద్దీ నిర్వహణ కోసం ప్రభుత్వ రైల్వే పోలీసు, రైల్వే భద్రతా దళ సిబ్బందిని నియమించడం వంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పశ్చిమ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమ రైల్వే వివిధ గమ్యస్థానాలకు 46 జతల ప్రత్యేక రైళ్లలో 400 ట్రిప్పులను నడుపుతోంది. వీటిలో 27 జతలు సూరత్, ఉధ్నా రైల్వే స్టేషన్ల ద్వారా బయలుదేరడం లేదా ప్రయాణిస్తున్నాయని పేర్కొంది.

రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలు

షేర్‌గావ్‌లో తొలిసారిగా పోలింగ్ కేంద్రం



జైపూర్ : రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని షేర్‌గావ్ గ్రామంలో తొలిసారిగా పోలింగ్ కేంద్రం ఏర్పాటయింది. అబు-పిండ్వారా అసెంబ్లీ నియోజకవర్గంలోని షెర్గావ్ ఓటర్లు తొలిసారిగా తమ సొంత గ్రామంలో ఓటు వేయగలరని అధికారి శనివారం తెలిపారు. సులభతరమైన, సమ్మిళిత ఓటింగ్ కోసం ఎన్నికల సంఘం అందుబాటులో లేని కొండ ప్రాంతాలు, మారుమూల, తక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో కూడా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేసిందని ప్రధాన ఎన్నికల అధికారి ప్రవీణ్ గుప్తా తెలిపారు. సిరోహి జిల్లాలోని అబు-పింద్వారా అసెంబ్లీ నియోజకవర్గంలో 4,921 అడుగుల ఎత్తులో ఉన్న షేర్గావ్ ఓటర్లు తొలిసారిగా తమ సొంత గ్రామంలో ఓటు వేయగలరని గుప్తా తెలిపారు. ఫారెస్ట్ గార్డుల సహాయంతో దట్టమైన అడవిలో దాదాపు 18 కిలోమీటర్లు నడిచి పోలింగ్ కేంద్రానికి చేరుకుంటారని గుప్తా తెలిపారు. ఇక్కడ 117 మంది ఓటర్లకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు, షేర్‌గావ్ ఓటర్లు మరో మారుమూల ఉత్రాజ్ గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది. బార్మర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలో ఉన్న బార్మర్ కా పార్ గ్రామంలో కేవలం 35 మంది ఓటర్లకు మాత్రమే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బార్మర్ జిల్లాలోని మరో గ్రామమైన మంజోలిలో తొలిసారిగా 49 మంది ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. అదేవిధంగా కంటల్ కా పార్ గ్రామంలో 50 మంది ఓటర్లకు పోలింగ్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక ప్రకటన ప్రకారం, జైసల్మేర్‌లోని మైనా పోలింగ్ స్టేషన్‌లో కేవలం 50 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఓటింగ్ రోజున అక్కడ టెంట్‌లో తాత్కాలిక బూత్‌ను ఏర్పాటు చేస్తారు. ధోల్‌పూర్ జిల్లాలోని బసేరి అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారిగా కలి తీర్‌లో పోలింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు గుప్తా తెలిపారు.

ఈ పోలింగ్ కేంద్రంలో 682 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో ఇక్కడి ఓటర్లు 7.5 కి.మీ దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. రాష్ట్రంలోని మొత్తం 200 స్థానాలకు ఒకే దశలో నవంబరు 25న ఓటింగ్ నిర్వహించి డిసెంబరు 3న లెక్కిస్తారు.

హిమాచల్ వాసుల్లో 'దీప కాంతులేవీ'?

సహకరించని ప్రకృతి...

ఆపిల్ దిగుబడి తగ్గుముఖం

ఆన్‌లైన్ దెబ్బతో వస్తు విక్రయాలు లేక దుకాణదారుల్లో నిరాశ

సిమ్లా : దేశ ప్రజల్లో దీపావళి పండుగ సంతోషం కానరావడంలేదు. ప్రతికూల రుతుపవనాల కారణంగా ఆపిల్ ఉత్పత్తి తగ్గిపోవడం, దీనికితోడు ఆన్ లైన్ విక్రయాలు దీపావళి సమయంలో వ్యాపారాలను, జీవనోపాధిని దెబ్బతీశాయి. ఆన్‌లైన్ సైట్‌లు అందించే భారీ తగ్గింపులు, ఇటీవలి వర్షాలకు సంబంధించిన విపత్తులు, తక్కువ ఆపిల్ ఉత్పత్తి కారణంగా ఇక్కడ కొనసాగుతున్న దీపావళి పండుగ సందర్భంగా వస్తువుల అమ్మకాలు 30 నుంచి 40 శాతం తగ్గాయని వ్యాపారుల సంక్షేమ సంఘం వ్యాపార్ మండల్ సిమ్లా తెలిపింది. 'ప్రజలు ఆధునిక వస్తువులకు మారడం వల్ల సాంప్రదాయ వస్తువులతో వ్యవహరించే దుకాణదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు, ఆన్‌లైన్ సైట్‌ల ద్వారా భారీ తగ్గింపులు, 14 రోజుల్లో ఉచిత మార్పిడితో ఇంటి వద్దకే క్యాష్ ఆన్ డెలివరీని అందించడం వల్ల అమ్మకాలపై పెద్ద నష్టాన్ని మిగిల్చింది. సిమ్లా నగరంలోని దుకాణాల్లో వ్యాపారాలు 30 నుంచి 40 శాతం పడిపోయాయి' అని వ్యాపార్ మండల్ సిమ్లా అధ్యక్షుడు హర్షిత్ కుమార్ మోంగా శనివారం పీటీఐకి తెలిపారు. అందుబాటులో ఉన్న మోడల్‌లను చూడటానికి మాత్రమే ఎక్కువ సంఖ్యలో వినియోగదారులు దుకాణాలను సందర్శిస్తారు. ఆపై వాటిని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తారు. ప్రధాన మార్కెట్‌ల దగ్గర పార్కింగ్ సదుపాయం సరిగా లేకపోవడం కూడా సమస్యగా ఉందని ఆయన చెప్పారు. 'మేము ఉద్యోగులకు జీతభత్యాలు, అద్దె, విద్యుత్, నీరు, ఇతర నిర్వహణ ఛార్జీలను చెల్లించాలి' అని అన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ సైట్‌లు అందించే భారీ తగ్గింపులతో సరిపోలడం లేదని దుకాణ యజమానులు మండిపడుతున్నారు. సిమ్లాలో దాదాపు 6 వేల వ్యాపార సంస్థలు ఉండగా, 12 వేల మందికి పైగా ఉపాధిని కల్పిస్తున్నాయి. ఈ సంస్థలలో సగం ప్రధాన నగరంలో ఉన్నాయి. నోట్ల రద్దు తర్వాత మార్కెట్ దిగజారిందని, ఆ తర్వాత వస్తు, సేవల పన్ను అమలు, కోవిడ్ మహమ్మారి, ప్రస్తుతం రుతుపవనాల ప్రభావంతో 509 మంది ప్రాణాలు కోల్పోయారని, 15,200 ఇళ్లు దెబ్బతిన్నాయని వ్యాపార్ మండల్ సిమ్లా మాజీ అధ్యక్షుడు సిమ్లా ఇంద్రజిత్ సింగ్ అన్నారు. 'దంతేరాస్ (శుక్రవారం) నాడు మంచి విక్రయాలు జరుగుతాయని మేము ఆశిస్తున్నాము. రోజు బాగా పుంజుకుంది. కాని వర్షం పాడుచేసింది. ప్రజలు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసి వెనుతిరిగారు' అని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా పర్యాటకం, ఆపిల్స్‌పై ఆధారపడి ఉంది. అయితే జులై నుంచి పర్యాటకం లేదు. దానికి తోడు వాతావరణ మార్పుల వల్ల ఆపిల్ ఉత్పత్తి తక్కువగా ఉందని, గత ఏడాది 3.6 కోట్ల ఆపిల్ బాక్సులతో పోలిస్తే 2023లో కేవలం 50 శాతం మాత్రమే ఉత్పత్తి అయ్యిందని నగరంలోని దుకాణదారు వరుణ్ తెలిపారు. డిజిటల్ లావాదేవీలకు పెద్దపీట వేయడంతో దీపావళి కానుకల విక్రయాలు కూడా తగ్గుముఖం పట్టాయని... రెడీమేడ్ దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బొమ్మలు, మొబైల్స్, గిఫ్ట్ ఐటమ్స్ వ్యాపారం చేసే చిరు వ్యాపారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మరో దుకాణదారు చును తెలిపారు.

వేతన స్కేళ్ల కోసం టీచర్ల ఆందోళన

రాంచీలో జేఎంఎం కార్యాలయం ముట్టడి

రాంచీ: వేతన నిర్ధారణ కోసం జార్ఖండ్‌లో ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. వెంటనే తమకు వేతనాలు ఖరారు చేయాలని డిమాండ్ చేస్తూ రాంచిలోని పాలక జేఎంఎం కేంద్ర కార్యాలయాన్ని వందలాదిమంది ఉపాధ్యాయులు శనివారం ముట్టడించారు. పరీక్షల్లో విజయం సాధించినప్పటికీ తమ వేతన స్కేళ్లను ఇప్పటికీ నిర్ధారించలేదని జార్ఖండ్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(జేటెట్)లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు చెప్పారు. టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 13 వేల మంది టీచర్లకు వేతన స్కేళ్లు నిర్ధారించాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని జార్ఖండ్ రాజ్య టెట్ సఫల్ అధ్యాపక్ సమన్వయ సమితి నాయకులు సిమంత ఘోషల్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు వెంటనే వేతన స్కేళ్లు నిర్ధారించాలని 2020 జూన్‌లో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశం సిఫార్సు చేసిందని ఆయన గుర్తు చేశారు. దీనిపై అడ్వకేట్ జనరల్ సూచనలను కూడా ప్రభుత్వం తీసుకుందని, టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణలైన ఉపాధ్యాయులకు వేతనాలు నిర్ధారించాలని అడ్వకేట్ జనరల్ కూడా సూచించారని చెప్పారు. తమ డిమాండ్ సాధన కోసం గడచిన 81 రోజులుగా రాజ్‌భవన్ వద్ద తాము ఆందోళనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 'ఈరోజు మేము జేఎంఎం కేంద్ర కార్యాలయాన్ని ఘెరావ్ చేశాం. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ పాండేతో సమావేశమయ్యాం. మా డిమాండ్ సరైనదేనని ఆయన అంగీకరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని పాండే హామీ ఇచ్చారు' అని ఘోషల్ చెప్పారు. తమ డిమాండ్‌ను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నవంబరు 15న నిరసనలు తెలుపుతామన్నారు. ప్రభుత్వం 26 వేల మంది టీచర్లను నియమించిందని, అందులో టెట్ పరీక్షలు రాసిన అభ్యర్థులకు 50శాతం కేటాయించిందని ఘోషల్ వివరించారు. తాము గత 20 ఏళ్లుగా బోధన చేస్తున్నామని, అందువల్ల 13 వేల ఉద్యోగాలను నేరుగా టెట్ అర్హత సాధించిన టీచర్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జేఎంఎం ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ పాండే మాట్లాడుతూ వేతన స్కేళ్ల నిర్ధారణ కోసం టెట్ అర్హత సాధించిన పారా టీచర్లు తన వద్దకు వచ్చారని చెప్పారు. చాలా రోజులుగా వారు రాజ్‌భవన్ వద్ద ధర్నా చేస్తున్నారని, వారి డిమాండ్‌ను తాను తీవ్రంగానే పరిగణిస్తున్నానని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పాండే తెలిపారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని తాను భావిస్తున్నానన్నారు.

ట్యాంక్‌లో దిగి పారిశుధ్య కార్మికుడి మృతి

భావనగర్: గుజరాత్‌లోని భావనగర్‌లో విషాదం చోటుచేసుకుంది. సెప్టెక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి దిగిన పారిశుధ్య కార్మికుడు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. ట్యాంక్‌లోకి ముందు దిగిన కార్మికుడిని కాపాడటానికి దిగిన రెండో కార్మికుడు రాజేశ్ వెగద్(45) చనిపోయాడు. భావనగర్‌లోని ప్రభుత్వ లేబొరేటరీ ఆవరణలో ఈ విషాదం చోటుచేసుకున్నట్లు అధికారులు శనివారం తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం భావనగర్‌లో సాల్ట్, మెరైన్ కెమికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో గల సెప్టెక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి భావనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కొంతమంది పారిశుధ్య కార్మికులు వచ్చారని, ముందుగా ఓ కార్మికుడు దిగి అస్వస్థతకు గురికావడంతో అతనిని కాపాడటానికి మరో కార్మికుడు దిగాడని మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీ ఉపాధ్యాయ చెప్పారు. అతనిని రాజేశ్‌గా గుర్తించినట్లు తెలిపారు.ముందు దిగిన కార్మికుడిని కాపాడిన రాజేశ్...తాను మాత్రం తప్పించుకోలేకపోయారని ఆయన చెప్పారు. ప్రమాదానికి కారణాలు తెలుసుకోవడానికి దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

సర్గుజలో కాంగ్రెస్ గెలుస్తుందా?

- అంతర్గతపోరు, ప్రభుత్వ వ్యతిరేకతతో సతమతం
- సీఎం, డిప్యూటీ సీఎం మధ్య ఆధిపత్య పోరు
- నలుగురు సిట్టింగ్‌లకు టికెట్ల నిరాకరణ
- చెమటోడుస్తున్న బీజేపీ

న్యూదిల్లీ: చత్తీస్‌గఢ్‌లోని సర్గుజ డివిజన్‌లో 2018 నాటి ఫలితాలు సాధించాలని కాంగ్రెస్ పార్టీ బలంగా కోరుకుంటున్నది. కానీ అంతర్గతపోరు, ప్రభుత్వ వ్యతిరేకత వంటి సవాళ్లను ఆ పార్టీ ఎదుర్కొంటున్నది. సర్గుజ డివిజన్‌లో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఈ ప్రాంతంలో మొత్తం సీట్లు ఒకపార్టీ గెలుచుకోవడం అదే మొదటిసారి. సర్గుజ ఫలిత ఫలితాలు కాంగ్రెస్‌ను సునాయాసంగా అధికారంలోకి తీసుకొచ్చాయి. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ సీట్లకుగాను కాంగ్రెస్ 68 స్థానాలు గెలుచుకొని 15 ఏళ్ల బీజేపీ పాలనకు తెరదించింది. ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్, ఉపముఖ్యమంత్రి టీఎస్ సింగ్‌దేవ్ మధ్య ఆధిపత్య పోరు పార్టీ గెలుపు అవకాశాలను దెబ్బతీయవచ్చని ఓ విశ్లేషకుడు నిర్మొహమాటంగా చెప్పారు. ఆ ఇద్దరు నాయకులు సర్గుజ ప్రాంతానికి చెందిన వారు కావడం విశేషం. సర్గుజ డివిజన్‌లో ఆరు జిల్లాలు-జష్పూర్, కొరియా, సూరజ్‌పూర్, బలరామ్‌పూర్, కొత్తగా ఏర్పడిన మనేంద్రగఢ్-చిర్మిరి-భరత్‌పూర్ ఉన్నాయి. ఈ ఆరు జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ 14 నియోజవర్గాలకు నవంబరు 17న పోలింగ్ జరుగుతుంది. ఇందులో 9 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు. సర్గుజ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతం. అత్యంత విలువైన ఖనిజ సంపదకు ఈ ప్రాంతం నిలయం. ఒకప్పుడు ఇది నక్సల్స్ ప్రభావిత ప్రాంతం. ఇప్పుడు ఇక్కడ మావోయిస్టుల ప్రభావం అంతగా లేదు. ఈ ప్రాంతం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ సరిహద్దుల్లో ఉంది. సర్గుజ డివిజన్ నుంచి 2008లో బీజేపీ 9, కాంగ్రెస్ ఐదు సీట్లు గెలుచుకున్నాయి. 2013లో కాంగ్రెస్, బీజేపీ ఏడు సీట్ల చొప్పున విజయం సాధించాయి. 2018లో మాత్రం బీజేపీ తుడిచిపెట్టుకుపోయింది. భూపేశ్ బాఘెల్ మంత్రివర్గంలో సర్గుజ ప్రాంతానికి చెందిన ముగ్గురు టీఎస్ సింగ్ దేవ్, అమర్‌జీత్ భగత్, ప్రేమ్‌సాయి సింగ్ తెకం సభ్యులుగా ఉన్నాయి. ఈ ఏడాది జులైలో తెకం మంత్రి పదవికి రాజీనామా చేశారు. సర్గుజ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు సాధిస్తుందని, 10-11 సీట్లు గెలిచి తీరుతుందని సింగ్ దేవ్ దీమా వ్యక్తంచేశారు. గత ఎన్నికలు మినహా ఈ ప్రాంతంలో ఏ పార్టీకి 14కి 14 సీట్లు వచ్చిన చరిత్ర లేదని, అన్నిసార్లు త్రిశతకాలు సాధించలేమని ఆయన పీటీఐతో మాట్లాడుతూ చెప్పారు. ఈ ఎన్నికల్లో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదు. సింగ్‌దేవ్ రాజకుటుంబానికి చెందిన నాయకుడు. ఈ ప్రాంతంలో ఆయన ప్రభావం అధికంగానే ఉంటుంది. ఆయన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడు. తమకు టికెట్ రాకపోవడానికి సింగ్ దేవ్ అని చాలామంది నిందిస్తున్నారు. తనను చంపడానికి సింగ్‌దేవ్ ప్రయత్నిస్తున్నారని రామానుగంజ్ నియోజకవర్గ ఎమ్మెల్యే బృహస్పత్ సింగ్ 2021లో పార్టీకి ఫిర్యాదు చేశారు. అందుకే ఆయనకు టికెట్ రాకుండా చేశారని భావిస్తున్నారు. కానీ సర్వేల ఆధారంగానే టికెట్ల కేటాయింపు జరిగినట్లు సింగ్‌దేవ్ చెబుతున్నారు. తమకు అందిన సర్వే ఫలితాల అధారంగానే తాము నిర్ణయాలు తీసుకున్నామని, పార్టీ పెద్దఎత్తున, చాలాసార్లు సర్వే చేయించిందని ఆయన వివరించారు. సర్వేలకు భిన్నంగా ఏ ఒక్కరికీ తాము టికెట్ కేటాయించలేదన్నారు. టికెట్ల కేటాయింపులో వ్యక్తిగత ద్వేషాలకు తావు లేదని బృహస్పత్‌సింగ్ అంశాన్ని ప్రస్తావించారు. బృహస్పత్ సింగ్ గెలుస్తాడని సర్వే చెబితే తాను ఎందుకు అడ్డుకుంటానని సింగ్ దేవ్ ఎదురు ప్రశ్నించారు.

మరోవైపు, గెలుపే లక్ష్యంగా ఈసారి కాంగ్రెస్, బీజేపీ కొత్త ముఖాలను రంగంలో దించాయని జర్నలిస్టు సుధీర్ పాండే చెప్పారు. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు-కేంద్రమంత్రి రేణుకాసింగ్, గోమతి సాయి, మాజీకేంద్ర మంత్రి విష్ణుదేవ్ సాయిని బీజేపీ పోటీకి దింపింది. 33 ఏళ్ల రామ్‌కుమార్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. రామ్‌కుమార్ సీఆర్‌పీఎఫ్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ఏడాది ఆరంభంలోనే రాజకీయాల్లోకి వచ్చారు. మంత్రి అమర్‌జిత్ భగత్‌పై రామ్‌కుమార్ పోటీ చేస్తున్నారు. టీఎస్ సింగ్‌దేవ్ ముఖ్యమంత్రి అవుతారన్న ఆశాభావంతో ఈ ప్రాంత ప్రజలు గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారని, అదే విధంగా ప్రచారం కూడా చేశారని జర్నలిస్టు పాండే గుర్తుచేశారు. కానీ సింగ్‌దేవ్, బాఘెల్ మధ్య విభేదాల కారణంగా స్థానికులకు ఎలాంటి లబ్ధి జరగలేదని, కాంగ్రెస్ విజయావకాశాలపై ఇది ప్రభావం చూపవచ్చని పాండే తెలిపారు.

ఇజ్రాయిల్‌కు మోదీ మద్దతు దారుణం

- పలస్తీనాలో శాంతికి కృషి చేయాలి: రామకృష్ణ
- అమెరికాకు మద్దతు సరికాదు: శ్రీనివాసరావు
- పలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ: పలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా వేలాది మంది చనిపోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. పలస్తీనాలో శాంతి నెలకొల్పడానికి అలీనదేశాలకు నాయకత్వం వహించిన భారత దేశ ప్రధానిగా చొరవ తీసుకోవాలని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. పలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాలు శనివారం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పసి పిల్లలను హత్య చేస్తూ సాగిస్తున్న ఇజ్రాయిల్ యుద్ధాన్ని చూసి ప్రపంచం నివ్వెరపోతోందని, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి నిరసనగా...పలస్తీనాకు సంఘీభావంగా ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఇజ్రాయిల్ దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. మనదేశ సంప్రదాయాలకు భిన్నంగా ప్రధాని మోదీ ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించటాన్ని రామకృష్ణ వ్యతిరేకించారు. ప్రజాతంత్ర శక్తులు ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. యుద్ధం కారణంగా పలస్తీనాలో మూడు లక్షల తొంభైవేల మంది ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు. కార్మికులు జీవించటం కష్టంగా ఉందన్నారు. పలస్తీనాలో శాంతి స్థాపనకు భారత ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా తోక పట్టుకుని మోదీ ముందుకు వెళితే భారతదేశానికి తిప్పలు తప్పవని హెచ్చరించారు. అరబ్బు దేశాలకు వ్యతిరేకంగా వెళితే పెట్రోల్ ధరలు పెరుగుతాయన్నారు. మాజీ ప్రధాని అతల్‌బిహారీ వాజ్‌పేయి సైతం పలస్తీనాకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. దేశ సంప్రదాయాలకు విరుద్ధంగా మోదీ ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించటాన్ని ఖండించారు. సొంతగడ్డపై పలస్తీనియన్లు శరణార్థులుగా జీవిస్తున్నారని చెప్పారు. ఇజ్రాయిల్‌పై హమాస్ దాడిచేస్తే... ఇజ్రాయిల్ పలస్తీనాపై దాడి చేయటం సమంజసం కాదన్నారు. ఈ యుద్ధం హమాస్‌పై ప్రతిదాడిగా లేదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పలస్తీనా సంఘీభావ కమిటీ అధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన నగరంలో సంఘీభావ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాతంత్రవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే ఖాదర్‌భాష, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎ.రవిచంద్ర, ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకులు అమర్‌నాథ్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని మతాల మధ్య జరుగుతున్న దాడిగా చిత్రీకరించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య, విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్.బాబూరావు, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాల్పుల విరమణకు పిలుపు ఇవ్వలేదేం?

- '2+2'పై మోదీ ప్రభుత్వానికి వామపక్షాల ప్రశ్న
- పలస్తీనాలో మారణహోమాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్

న్యూదిల్లీ: భారత్, అమెరికా మంత్రుల స్థాయి 2+2 సమావేశంలో పలస్తీనాలో కాల్పుల విరమణకు మోదీ ప్రభుత్వం పిలుపు ఇవ్వకపోవడాన్ని వామ పక్షాలు తీవ్రంగా పరిగణించాయి. విరామం గురించి మాట్లాడారే తప్ప దాడులను ఆపాలని పిలుపు ఎందుకు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, ఏఐఎఫ్‌బీ, ఆర్‌ఎస్‌పీ ప్రశ్నించాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. పలస్తీనాలో ఇజ్రాయిల్ నర మేధం సృష్టిస్తోందని, తక్షణమే దాడులను ఆపాలని డిమాండ్ చేశాయి. భారత్-అమెరికా 2+2 మంత్రుల స్థాయి సమావేశంలో కాల్పుల విరమణకు మోదీ ప్రభుత్వం పిలుపు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండిం చాయి. అమెరికా-ఇజ్రాయిల్ మారణహోమానికి మద్దతివ్వవద్దని కేంద్రానికి మరోమారు సూచించాయి. 2+2 చర్చల్లో మానవతా విరామం, రెండు దేశాల పరిష్కారం గురించి ప్రస్తావించారే తప్ప కాల్పుల విరమణకు పిలుపు ఇవ్వలేదని పేర్కొన్నాయి. 'ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 11వేల మందికిపైగా పలస్తీనియన్లు మరణించారు. మృతుల్లో దాదాపు సగం మంది పిల్లలే ఉన్నారు. ఆసుపత్రులపై భీకర దాడులు జరుగుతున్నాయి. తక్షణమే దాడులను ఇజ్రాయిల్ నిలిపి వేయాలి. అది జరిగితేనే పరిష్కారం సాధ్యమవుతుంది' అని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, ఏఐఎఫ్‌బీ, ఆర్‌ఎస్‌పీ సంయుక్త ప్రకటన పేర్కొంది.

ఆ నిరంకుశ ఉత్తర్వులు వెనక్కి

ఏఐటీయూసీ డిమాండ్

న్యూదిల్లీ: కేంద్ర పాలిత జమ్ముకశ్మీర్‌లో ఉద్యమాలు, ఆందోళనలు, నిరసనలపై నిషేధం విధిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నిరంకుశంగా జారీ చేసిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. రాజ్యాంగబద్ధ హామీలను కాలరేసే విధంగా వ్యవహరించడం తగదని పేర్కొంది. ఈ పరిస్థితి అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌ఓ)కు ముందున్న పరిస్థితులను గుర్తుచేస్తున్నదని, ఉద్యోగులకు వ్యతిరేకమైన మనస్థత్వానికి అద్దంపడుతున్నదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ శనివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. 'ఇది కేంద్ర పాలిత ప్రాంతం కాబట్టి కేంద్రప్రభుత్వం ప్రమేయం లేకుండా ఇలాంటి ఉత్తర్వులు జారీ కావు. పాలకులు నిషేధించాలని భావించే సమ్మెలు, ప్రదర్శనలకు భావ ప్రకటన స్వేచ్ఛగా రాజ్యాంగం హామీనిచ్చింది. ఓఎం ద్వారా రాజ్యాంగ నిబంధనలను కొట్టిపారేయలేరు' అని ఆమె పేర్కొన్నారు. అదే సమయంలో కామేశ్వర్ ప్రసాద్ వర్సెస్ బీహార్ రాష్ట్రం కేసులో 1962లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఉత్తర్వులను ప్రస్తావించారు. బీహార్ ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనల్లోని నియమం 4ఏ రాజ్యాగబద్ధతను కామేశ్వర్ ప్రసాద్ అప్పట్లో సవాల్ చేశారని గుర్తుచేశారు. 'పదవిలో ఉన్నంత కాలం ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా ఎలాంటి ప్రదర్శనల్లో పాల్గొనరాదు, ఎటువంటి సమ్మెలతో ముడిపడరాదన్నది ఆ నిబంధన. కేవలం ప్రదర్శనలను సవాల్ చేశారే తప్ప సమ్మెలను కాదు. దీనిని విచారించిన కోర్టు ఆ నిబంధనను కొట్టివేసింది. రాజ్యాంగ విరుద్ధమైనదిగా పేర్కొంది. ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగంలో చేరినంత మాత్రాన భారత పౌరుడు కాకుండా పోడని, పౌరులకున్న స్వేచ్ఛను కోల్పోబోడని వ్యాఖ్యానించింది' అని కౌర్ పేర్కొన్నారు. ఆందోళనలను నిషేధించే ఉత్తర్వులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆదేశాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల జీవోను సవరించండి

సీఎం జగన్‌కు ఏపీయూడబ్ల్యూజే వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలను కేటాయిస్తూ జారీ చేసిన జీఓ నంబరు 395 లో మార్పులు, సవరణలు చేయాలని కోరుతూ సీఎం జగన్‌కు శనివారం ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్థన్, ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, కార్యవర్గసభ్యులు ఆలపాటి సురేష్‌కుమార్, ఎం.ప్రసాద్, నల్లి ధర్మారావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు యేచూరి శివ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామనీ, అయితే ప్రభుత్వం విడుదల చేసిన జీవో తమను పూర్తిగా నిరాశపర్చిందని తెలిపారు. దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న పాత్రికేయులకు ఈ జీవో దిగ్భ్రాంతి కలిగించింది. అందులో ప్రకటించిన నియమ నిబంధనల కారణంగా వేలాదిమంది జర్నలిస్టులు అనర్హులుగా మిగిలిపోతారని వారు పేర్కొన్నారు. జర్నలిస్టులలో కొందరికి మాత్రమే అవకాశం ఇస్తూ, అత్యధికులకు ఇంటిస్థలాన్ని నిరాక రించే నియమ నిబంధనలను సవరించాలని, జర్నలిస్టులు అందరికీ ఇళ్లు ఇస్తామన్న మీ ఎన్నికల వాగ్దానం సంపూర్ణంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మీరు హామీ ఇచ్చేనాటికి 2019లో సుమారు 21 వేలమంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్ సదుపాయం ఉన్నది. ప్రస్తుతం 9వేల మందికే ఇచ్చారు. అక్రెడిటేషన్ లేని కారణంగా 12 వేలమంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు అవుతారు. అప్పటికి పత్రికల, చానళ్ల డెస్కులలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు గతంలో అక్రెడిటేషన్ సదుపాయం లేదు. వారందరూ నష్టపోతారు. జర్నలిస్టుకు, వారి జీవిత భాగస్వామికి వారసత్వపరంగా గానీ లేదా ఇతరత్రా సమకూడిన సొంత ఇల్లు ఉంటే వారిని అనర్హులుగా చేయ డం గతంలో ఎన్నడూ జరగలేదు. ప్రస్తుత జీవోలో పేర్కొన్న నియమాన్ని పూర్తిగా ఎత్తివేయాలని కోరుతున్నాం. స్థలాల కొనుగోలు నిమిత్తం అయ్యే వ్యయంలో ప్రభుత్వం 60 శాతం, జర్నలిస్టు 40 శాతం భరించేందుకు జీవోలో నిబంధన విధించారు. జర్నలిస్టులకు చట్టబద్ధ వేతనాలు గానీ, జీవన వ్యయానికి అనుగుణమైన ఆదాయాలు గానీ లేవన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని నామమాత్రపు ధరకు స్థలాలు కేటాయించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చిరకాలంగా పనిచేస్తున్న గిరిజనేతర పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు చేయడంలో 1/70 చట్ట ప్రకారం స్థానికంగా స్థలాలు ఇవ్వడం వీలు కుదరడం లేదు. ప్రస్తుత జీవోలో కూడా వారి గురించిన ప్రస్తావన రాలేదు. గతంలో కొందరు జర్నలిస్టులు బలహీనవర్గాల కోటాలో, టిడ్కో, వాంబే, రాజీవ్ స్వగృహ లాంటి అనేక ఇతర పథకాలలో ఇళ్లు, స్థలాలు తీసుకున్నప్పటికీ ఆయా పథకాలలో ఇళ్లు స్వాధీనం కాని వారు కొందరున్నారు. నిర్మాణం సందర్భంగా తీసుకున్న అప్పులు తీర్చలేక అమ్ముకున్నవారు మరికొందరు ఉన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన లబ్ధి వాస్తవంగా వారికి లభించలేదు. అటువంటి వారికి వన్ టైమ్ సెటిల్ మెంట్‌గా మరోసారి అవకాశం కల్పించాలని ఆ మేరకు జీఓ లో సవరణ చేయాలని కోరారు. జర్నలిస్టులు అందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలన్న మీ సంకల్పం నెరవేరడానికి వీలుగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని, అందరికీ న్యాయం జరిగేటట్లు సానుకూలంగా స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం

- డిసెంబరు 4 నుంచి 11 వరకు నియోజకవర్గ కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలు
- విజయవాడలో ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాలతో 15న ఒకరోజు దీక్ష
- 18న జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీ, అర్జీల అందజేత

విశాలాంధ్ర-విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తామని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక దాసరి భవన్‌లో శనివారం అసోసియేషన్ సమావేశం జరిగింది. అనంతరం ముప్పాళ్ల విలేకర్లతో మాట్లా డుతూ తాను అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితు లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి తాము నిరంతరం చేసిన పోరా టాల కారణంగా కొంత మందికి న్యాయం చేశారని, బాధితులందరికీ న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం డిసెంబరు 4 నుంచి 11 వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ దీక్షలో అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్ల కుటుంబాలు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 15న విజయవాడ ధర్నా చౌక్ వద్ద అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన మోసాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలతో ఒక రోజు దీక్ష చేయనున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇప్పటికే రూ.5 లక్షలు ఇచ్చిన వారికి మిగిలిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 18న రాష్ట్రంలోని 26 జిల్లా కార్యాలయాల వద్ద అగ్రిగోల్డ్ బాధితులతో ర్యాలీలు నిర్వహించిన అనంతరం స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయకపోతే వచ్చే జనవరి నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కంపెనీ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయాలని, ప్రజల సొమ్మును దోచుకుని విలాసవంతంగా జీవిస్తున్న కంపెనీ డైరెక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి కస్టమర్లు, ఏజెంట్లు, బాధిత కుటుంబాల సభ్యులు హాజరయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవీ నాయుడు, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, నాయకులు నారాయణప్ప (అనంతపురం), రాంబాబు, శ్రీనివాస్ (కాకినాడ), వెంకట్ (దర్శి), షరీఫ్ (విజయవాడ), ఆగస్టీన్ (గుంటూరు), మంత్రు నాయక్, అంజనాదేవి (పల్నాడు), రామ శ్రీను (పశ్చిమ గోదావరి) తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం ప్రమాదకరం

- జేవీ సత్యనారాయణమూర్తి
- శ్రీకాకుళంలో పలస్తీనా సంఘీభావ ర్యాలీ

విశాలాంధ్ర-గార (శ్రీకాకుళం): పలస్తీనా ప్రజల న్యాయమైన సమస్యలు పరిష్కరించి శాంతి పునరుద్ధరణకు ఐక్యరాజ్యసమితి చొరవ చూపాలని, ఇజ్రాయిల్ మారణకాండను అడ్డుకోవడానికి ప్రపంచదేశాలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం విశాఖపట్నం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి సూచించారు. పలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ ఆపాలని, 1967కు ముందుగల భూభాగంతో స్వతంత్ర పలస్తీనా దేశం ఏర్పరచాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎన్‌అర్ దాసరి క్రాంతి భవనంలో అఖిలభారత శాంతి సంఘీభావ సంస్థ అధ్వర్యంలో శనివారం సదస్సు జరిగింది. అఖిల భారత శాంతి సంఘీభావ సంస్థ కో కన్వీనర్ చిక్కాల గోవిందరావు అతిథులకు ఆహ్వానం పలకగా, కన్వీనర్ బి.కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను ప్రపంచ శాంతి కాముకులు ఖండించాలని కోరారు. 75 ఏళ్లుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల కారణంగా పలస్తీనా ప్రజలు ప్రాథమిక హక్కులు కోల్పోయి బహిరంగ జైళ్లలో మగ్గుతున్నారని విమర్శించారు. వేలాదిమంది పసిపిల్లలను, మహిళలను ఉన్మాదంతో పొట్టన పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ చర్యలు పలస్తీనా ప్రజల జీవించే హక్కును హరించి వేస్తున్నాయని మండిపడ్డారు. పలస్తీనాలో శాంతి నెలకొల్పటానికిగాను శాశ్వత పరిష్కారం కోసం ఐక్యరాజ్యసమితి181వ తీర్మానం ప్రకారం రెండు దేశాలుగా విభజించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అమెరికా ఆర్థిక భవితవ్యం యూదుల చేతుల్లో ఉందని, ఆ కారణంగా వారికి అమెరికా అండదండలందిస్తోందని విమర్శించారు. ఇజ్రాయిల్ దురాగతాలు ప్రపంచానికి తెలియకుండా మీడియాను నియంత్రిస్తోందన్నారు. 40 రోజులుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ కారణంగా 10 వేల మందికి పైగా పలస్తీనియన్లు చనిపోయారన్నారు. అమెరికా బాటలోనే మన దేశం కూడా ఇజ్రాయిల్ దురాగతాలకు వత్తాసు పలకడం శోచనీయమన్నారు. నెహ్రూ నుండి వాజ్‌పేయి వరకూ భారత ప్రధానులం దరూ వలస దేశాలకు మద్దతు ప్రకటించారని, మోదీ మాత్రం అతివాద పాలకులకు, ప్రజాస్వామ్య వ్యతిరేకు లకు మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కి అమెరికా ఆయుధాలు సరఫరా చేస్తూ యుద్ధానికి ప్రత్యక్షంగా సహకరిస్తోందని విమర్శిం చారు. ఇజ్రాయిల్ యూదు దురహంకారాన్ని పెంచిపోషిస్తోందన్నారు. అరబ్ దేశాల్లో అమెరికా ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్ పనిచేస్తోందని పలస్తీనా సమస్య, పుట్టు పూర్వోత్తరాలు, అమెరికా సామ్రాజ్య వాదుల కుట్రలను విశ్లేషించారు. సాహితీవేత్త జీవీకే మూర్తి ఇజ్రాయిల్ క్రూర, కఠినత్వాన్ని ప్రతిబింబిం చేలా కవిత చదివి వినిపించారు. అనంతరం పలస్తీనాకు మద్దతుగా రామలక్ష్మణ కూడలి మీదుగా సూర్యమహల్ కూడలి వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సీపీఐ నాయకులు చాపర వెంకట రమణ, అనపాన షణ్ముఖరావు, ఎం.యుగంధర్, కె.శ్రీనివాసరావు, డోల శంకరరావు, కొమర భాస్కరరావు, నిమ్మాడ కృష్ణమూర్తి, చింతు ఎర్రయ్య, సీపీఎం నాయకులు పి.తేజేశ్వరరావు, డి.పార్వతీశం, సీహెచ్ వెంకటరమణ, ఎం.ఆదినారాయణమూర్తి, ఎం.గోపి, పి.సుధాకరరావు సానూ, షేక్ జిలానీ, సీపీఐ నాయకులు గుడ్ల రామకృష్ణ, సోమశేఖర్, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు సమయం ఆసన్నం

దొరల పాలనను తరిమికొడదాం: రాహుల్‌గాంధీ

న్యూదిల్లీ: దేశంలో ప్రజాపాలన తిరిగి రావడానికి సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేకపోయిందని విమర్శించారు. తెలంగాణలో 2020లో ఆత్మహత్యకు పాల్పడిన ఓ రైతు కుటుంబాన్ని ఇటీవల పరామర్శించిన వీడియోను రాహుల్ శనివారం షేర్ చేశారు. వీడియోతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాహుల్‌గాంధీ పోస్టు చేశారు. తెలంగాణ ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి తాము కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. 'కుమ్మరి చంద్రయ్య గొంతు వినడానికి దొరల బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరాకరిం చింది. చంద్రయ్య తెలంగాణలో చిన్న రైతు. జీవనం కష్టంగా మారింది. రుణభారం పెరిగింది. తన అభిమాన కుటుంబాన్ని వదిలి చంద్రయ్య ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని రాహుల్ పేర్కొన్నారు. వీటితో పాటు చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించిన వీడియోను పోస్టు చేశారు. 'సరైన సమయంలో చంద్రయ్యకు ప్రభుత్వం మద్దతు లభించి ఉంటే ఆయన సజీవంగా ఉండేవాడు. ఆయన కుటుంబం ఆనందంగా జీవించేది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో బీఆర్‌ఎస్, బీజేపీ వంటి దొరల ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి' అని రాహుల్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే అలా జరిగేది కాదని రాహుల్ తెలిపారు. చంద్రయ్య వంటి కోట్లాదిమంది ప్రజల వాణి, ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో అమలు సాధ్యమయ్యే హామీలు ఇచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలకు కనీస అవసరాలు కల్పించడానికి వీలుగా తమ హామీలు ఉన్నాయన్నారు. రుణభారంతో తమ కుటుంబం సతమతమవుతోందని కుమ్మరి తిరుపతమ్మ చెప్పిందని, ఇలాంటి పరిస్థితిని త్వరలోనే మారుస్తామని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇచ్చిన హామీల జాబితాను రాహుల్ గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500, ఉచిత బస్‌పాస్, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని రాహుల్ చెప్పారు.

తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర

చంద్రమోహన్ మృతికి ప్రముఖుల సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్: తన వైవిధ్యమైన నటనతో సుదీర్ఘ కాలంపాటు తెలుగు ప్రేక్షకులను అలరించిన చంద్రమోహన్ రెండు తరాల నటులతో కలిసి నటించి తెలుగు ప్రజల హృదయాల్లో చరగని ముద్ర వేశారు. హీరోగా, హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అనేక పాత్రల్లో ఆయన వెండితెరపై వెలిగారు. తెలుగులో ఒకప్పుడు గొప్ప హీరోయిన్లుగా వెలిగిన వారందరూ తమ మొదటి సినిమాను చంద్రమోహన్ సరసన నటించిన వారే కావడం గమనార్హం. ఆయన పక్కన హీరోయిన్‌గా నటిస్తే తిరుగు ఉండదనే భావన చాలా మంది హీరోయిన్లలో ఉంది. జయసుధ, జయప్రద మొదలు సుహాసిని వరకు అందరూ తొలినాళ్లలో ఆయన సరసన నటించినవారే. 932 పైగా సినిమాల్లో నటించిన చంద్రమోహన్ 1966లో రంగులరాట్నం చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. ఎన్నో విలక్షణమైన పాత్రలతో తెలుగు ప్రజల మనసులో చెరిగిపోని స్థానాన్ని సంపాదించుకున్నారు.

చంద్రమోహన్ మృతికి అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులు తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్‌తో పాటు వైఎస్.జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, నందమూరి బాలకృష్ణ, పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. పౌరానిక చిత్రాలు, కుటుంబ కథా చిత్రాలు, తన హాస్యానటనతో తెలుగు ప్రేక్షకులను చంద్రమోహన్ ఆకట్టుకున్నారని బాలకృష్ణ అన్నారు. చంద్రమోహన్‌తో పాటు అనేక చిత్రాల్లో నటించానని ఆయన మృతి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు లోటని అన్నారు. చంద్రమోషన్ మృతిపై ఎక్స్‌లో చిరంజీవి స్పందిస్తూ 'సిరిసిరిమువ్వ', 'శంకరాభరణం', 'రాధాకళ్యాణం', 'నాకూ పెళ్ళాం కావాలి' లాంటి అనేక ఆణిముత్యాల్లాంటి చిత్రాల్లో ఆయన నటించారని గుర్తు చేసుకున్నారు. తన వైవిధ్య నటనా కౌశలం ద్వారా తెలుగు వారి మనస్సుల్లో చెరగని ముద్ర వేశారన్నారు. నా తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు'లో ఒక మూగవాడి పాత్రలో అత్యద్భుతమైన నటన ప్రదర్శించారన్నారు. ఆ సందర్భంగా ఏర్పడిన మా తొలి పరిచయం, ఆ తర్వాత మంచి స్నేహంగా, మరింత గొప్ప అనుబంధంగా మారిందన్నారు. ఆయన సాన్నిహిత్యం ఇక లేకపోవటం వ్యక్తిగతంగా తీరని లోటుగా పేర్కొన్నారు. విభిన్నమైన పాత్రలతో, విలక్షణమైన నటనతో, దశాబ్దాలుగా కోట్లాదిమంది ప్రేక్షకులను అలరించిన చంద్రమోహన్ మరణం, తెలుగు చిత్ర సీమకు తీరని లోటని తెలంగాణ సీఎం కె. చంద్రశేఖరరావు విచారం వ్యక్తం చేశారు. వారి స్ఫూర్తితో ఎందరో నటీ నటులు ఉన్నత స్థాయికి ఎదిగారని, కళామతల్లి ముద్దుబిడ్డగా తెలుగుతో పాటు అనేక భాషల్లో లక్షలాదిమంది అభిమానాన్ని చంద్రమోహన్ సొంతం చేసుకున్నారని సీఎం తెలిపారు.

నరమేధాన్ని తక్షణమే ఆపాలి

- పలస్తీనాలో నేరాలకు ఇజ్రాయిల్‌దే బాధ్యత
- దాడుల విస్తరణ వెనుక అమెరికా హస్తం
- శాశ్వత కాల్పుల విరమణ గాజాకు అవశ్యం
- అరబ్, ముస్లిం దేశాల సదస్సులో నాయకులు

రియాద్: గాజాలో దురాక్రమణ, నరమేధాన్ని తక్షణమే నిలిపివేయాలని సౌదీ అరేబియా, ముస్లిం దేశాలు ఉమ్మడిగా డిమాండ్ చేశాయి. పలస్తీనాలో యుద్ధ నేరాలకు ఇజ్రాయిల్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నాయి. రెండురోజుల పాటు రియాద్‌లో జరగబోయే ఇస్లామిక్-అరబ్ సదస్సు శనివారం ప్రారంభమైంది. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, ఇరాన్, టర్కీ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ, తయ్యిప్ రిసెప్ ఎర్డోగన్, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ, సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ తదితరులు పాల్గొన్నారు. పలస్తీనాకు మద్దతు తెలిపారు. మహమ్మద్ బిన్ సల్మాన్ మాట్లాడుతూ 'పలస్తీనాలోని మన సోదరులపై అమానవీయ పోరును నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాం... తీవ్రంగా ఖండిస్తున్నాం. మనమిప్పుడు మానవతా విపత్తును ఎదుర్కొంటున్నాం. అంతర్జాతీయ చట్టాలను అతిక్రమిస్తున్న ఇజ్రాయిల్‌ను కట్టడి చేయడంలో అంతర్జాతీయ సమాజం, భద్రతా మండలి విఫలమయ్యాయని రుజువైంది' అని అన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు తక్షణమే నిలిపివేయాలని అమెరికాకు పలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్‌ను కట్టడి చేసేందుకు ఇంధనం, వస్తు ఎగుమతిపై ఆంక్షలు విధించడం ఒక్కటే మార్గమని ఇస్లామిక్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ సూచించారు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ మాట్లాడుతూ గాజాకు కావాల్సినది కొన్ని గంటల విరామం కాదు శాశ్వత కాల్పుల విరమణ అని నొక్కిచెప్పారు. అంతర్జాతీయ చట్టాలకు అతీతమన్నట్లు ఇజ్రాయిల్‌ను ఎప్పటివరకు అంతర్జాతీయ సమాజం తన భుజాలపై మోస్తుందని ఖతార్ అమీర్ షేక్ తమీమ్ దుయ్యబట్టారు. ఇజ్రాయిల్‌తో తెగతెంపులు చేసుకోవాలని అల్జీరియా నేతృత్వ దేశాలు ప్రతిపాదించగా కొన్ని దేశాలు విభేదించాయి. ఇజ్రాయిల్ దురాక్రమణ ఆగకపోతే దీని పర్యవసానాన్ని మొత్తం ప్రపంచం అనుభవించాల్సి ఉంటుందని జోర్డాన్ రాజు అబ్దుల్లా2 హెచ్చరించారు. తాము విధిగా గాజాకు మానవతా సాయాన్ని అందజేస్తామని చెప్పారు. గాజాలో మారణహోమంపై కచ్చితమైన వైఖరిని అంతర్జాతీయ సమాజం కలిగివుండాలని ఈజిప్టు అధ్యక్షుడు సిసీ అన్నారు.

మాటలు కాదు చేతలకు ఇది సమయం: రైసీ

గాజాలో దాడులపై చర్యలకు సమయం ఆసన్నమైందని ఇబ్రహీం రైసీ అన్నారు. మాటలు కాదు చేతలకు ఇది సమయమని నొక్కిచెప్పారు. ఇస్లామిక్ దేశాల ఐక్యత ఎంతో ప్రధానమన్నారు. దురాక్రమణ విస్తరించాలని కోరుకోవడం లేదంటూనే అందుకు దోహదమవుతోందని అమెరికాపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అగ్రరాజ్యం చెబుతున్నదానికీ చేసే పనికి పొంతన లేదన్నారు. గాజాలో పనిచేస్తున్న యుద్ధ యంత్రం అమెరికా చెప్పుచేతల్లో ఉందని, తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయకుండా... దాడులను విస్తరిస్తోందని దుయ్యబట్టారు. అమెరికా నిజస్వరూపాన్ని ప్రపంచం చూడాలని రైసీ అన్నారు. ఈ సదస్సు ఇచ్చే బలమైన సందేశంతో పలస్తీనాలో యుద్ధ నేరాలు ముగుస్తాయని ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమిరాబ్దుల్లాహిన్ ఆకాంక్షించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.